# హాస్యానందం

తెలుగులో వెలువడుతున్న ఏకైక హాస్య మాస పత్రిక

23వ నవ్వుల వసంతం

సంపూర్ణ హాస్య మాసపత్రిక జూలై-2025 ₹25




**సినిమా తీద్దామా?**

గొలుసు సీరియల్ ప్రారంభం!

**ముళ్ళపూడి వెంకటరమణ హాస్య కథల పోటీలో బహుమతి పొందిన కథలు**




**సంభ్రమం! ఆశ్చర్యం!! అద్భుతం!!!**

సివిల్ సర్వెంట్గా నా 35 ఏళ్ల కెరీర్లో డిప్యూటీ కలెక్టర్ నుంచి ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి (రెవెన్యూ) వరకు పని చేసిన ప్రతి పోస్టులోనూ నాదంటూ ఒక ముద్రవేసే ఆసక్తిని, ఆ శక్తిని, అవకాశాన్ని... ఆ శ్రీనివాసుడు ఇచ్చాడు. అన్ని పోస్టుల కన్నా అమూల్యమైనది, దివ్యమైనదిగా నేను భావించిన తిరుమల తిరుపతి దేవస్థానాల ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పోస్టు. ఆ పోస్టులో నేను సంకల్పించి, చేపట్టిన ప్రతి కార్యంలోనూ **"నాకు పరీక్షలూ ఆయనే పెట్టాడు... పరిష్కారమూ ఆయనే చూపించాడు."** ఒక్కసారి వెనక్కి తిరిగి చూస్తే 'అసాధ్యం' అని నేను ఆశ వదులుకున్న మహాకార్యాలను కూడా ఆ స్వామి ఎలా 'సుసాధ్యం' చేయించాడో... తలుచుకుంటే సంభ్రమం, ఆశ్చర్యం, అద్భుతం...!!!

**హరే శ్రీనివాసా!**

-డా॥ కె.వి.రమణాచారి IAS(Retd)

**వెల: 150 రూపాయలు**

ప్రతులకు సంప్రదించండి-
సాహితీ ప్రచురణలు, 33-22-2, చంద్ర బిల్డింగ్స్,
సి.ఆర్. రోడ్డు, చుట్టగుంట, విజయవాడ-520 004
ఫోన్: 0866 2436643

తెలుగులో వెలువడుతున్న ఏకైక హాస్యమాస పత్రిక
జీ'వనం'లో నవ్వు నవ వసంతం

# హాస్యానందం

జూలై-2025
23వ సంవత్సరం
253 వ సంచిక

ముఖచిత్రం: ప్రియాంక మోహన్

Publisher& Editor-
Ramu.P

Editorial Office:
**HASYANANDAM**
# 8-215/4, Near Ramalayam,
**Po:YERRABALEM-522 503**
Mangalagiri Mandal, Guntur dist.
Ph : 9849630637
email: **hasyanandam.mag@gmail.com**
web: **www. hasyanandam.com**

Full Pillar : Bnim
Cartoon Feature Editor: Bachi

Creative Team
Dr. K.Ramakrishna, Bachi
Kandlakunta SarathChandra
Vadlamannati Gangadhar,
GopalKrishna, Gandhi, Nagisetty,
Bomman, Dayakar, Sangram, Krishna

D.T.P: P. Ramalakshmi, 9440304993
Digital Media Director: Surya

Well Wishers:
Dr.K.V.Ramanachary, (I.A.S.Retd)
Tanikella Bharani
Dr.Sudarsan
K.V.V.Satyanarayana
Gudibandi Venkata Reddy
Dr.V.V.Rama Kumar

Prize Sponsers
K.V.V.Satyanarayana
Cartonist JSR
K.Sundaresayya &
Satyavathi
Md.Raj Mohammed
Nimmi Madhubala
Mallika, Lakshmi
A.V.Krishna Murthy

| సంవత్సర చందా-రూ.300/- (పోస్టల్ చార్జీలు ఉచితం) | 2 సంవత్సరాల చందా-రూ.600/- (పోస్టల్ చార్జీలు ఉచితం) |
|---|---|

**జీవిత చందా- రూ.5000/-లు**

Gpay or Ppay # 9849630637


**Hyderabad & Secunderabad Distributor:**
M.Panduranga, **Risingsun News Agency**
Shop# 5-4-25/b-8, Farman wadi, Abids, Agarwala Sweets lane,
Hyderabad -500001. Mobile# 9666680857, 6301072906.




Smile in Every Page...Satisfaction in Every Smile












# ఎక్కడెక్కడ ఏమున్నాయి?...

## ముళ్లపూడి హాస్య కథల పోటీలో బహుమతి పొందిన కథలు

**11-30**

## సత్కళాభారతి సత్యనారాయణ గారికి వజ్రోత్సవ జన్మదిన శుభాకాంక్షలు

**10**


శీర్షికలు


| | | |
|---|---|---|
| ఈనెల ప్రోత్సాహక బహుమతులు | | -8 |
| వాక్చిత్రం | -సుధామ | -36 |
| తెలుగా మజాకా?! | -డాక్టర్ కప్పగంతు రామకృష్ణ | -42 |
| వెనక్కి వెళ్ళే కథలు | -గంగాధర్ వడ్లమన్నాటి | -44 |
| స్మైల్‌స్టార్స్ | -బొమ్మన్ | -46 |
| నవ్వులాట | -గాంధీ మనోహర్ | -48 |
| పదానందం | -పోపూరి విశ్వనాథ్ | -50 |


సీరియల్


| | | |
|---|---|---|
| కొంగుచాటు కృష్ణుడు | -యండమూరి వీరేంద్రనాథ్, యర్రంశెట్టి శాయి | -32 |
| సినిమా తీద్దామా? | -గొలుసు సీరియల్ | -38 |


### కార్టూన్ శీర్షికలు




| | | |
|---|---|---|
| అబ్బాయి పెళ్ళి | -జయదేవ్ | -34 |
| నవ్వుకొమ్మచ్చి | -సరసి | -35 |
| పంచ్ ఫ్రేమ్ | -కృష్ణ | -41 |


### ఈ సంచికలో కార్టూనిస్టులు

- జయదేవ్
- సరసి
- గాంధి
- కృష్ణ
- బీవీఎస్
- బాచి
- శ్రీకుమార్
- శేషిరెడ్డి
- వందన శ్రీనివాస్
- నాగిశెట్టి
- ఎమ్.రాము
- మోహన్ కుమార్
- శర్మ
- ప్రసిద్ధ
- కామేష్
- శేఖర్
- శిరి
- కాశ్యప్
- నాథ్
- ఆది నారాయణ
- సునీల్
- సురేష్
- తోపల్లి ఆనంద్
- చక్రవర్తి
- దొరశ్రీ
- ఉలి
- నాగ్రాజ్
- గిరి
- సాయికృష్ణ
- రామ్‌శేషు
- పద్మ
- వర్మ
- ఈశ్వర్
- విజయ్
- సత్యనారాయణ
- టి.భాస్కర్
- దాస్
- డేవిడ్

**గమనిక:**

ఈ పత్రికలో ప్రచురింపబడే వ్యంగ్య, హాస్య రచనలు, కార్టూన్లు కేవలం హాస్యం కోసం ప్రచురించినవి మాత్రమే. ఏ వ్యక్తిని గాని, సంస్థని గాని కించపరచాలన్నది అభిమతం కాదు. ఇందులో ప్రచురించిన రచనలన్నీ ఆయా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలు మాత్రమే.

# హాయ్...సానందంగా...

**హాస్యానందం అభిమానులకు... ఆప్తులకు... హాస్యప్రియులకు... సన్నిహితులకు హాస్యాభివందనాలు!**

ప్రయారిటీ... అదేనండీ ప్రాధాన్యత!
మనం ఒకోసారి ఈ విషయంలో చిన్న చిన్న పొరపాట్లు... పెద్ద పెద్ద తప్పులు చేసేస్తుంటాం!
ఎవరికి ఎలా ప్రాధ్యాత ఇవ్వాలి... అన్నది చాలా సున్నితమైన అంశం. ఇద్దరు మనుషులు ఉన్నప్పుడూ ఒకరిని గౌరవిస్తూ... మరొకర్ని అసలు పట్టించుకోక పోవటం మనం చేస్తున్న పొరపాటు... అలాగే ఒక వ్యక్తికి విపరీతంగా ప్రాధాన్యత ఇచ్చి అక్కడే వున్న మరో వ్యక్తిని నిర్లక్ష్యం చేయటం 'తప్పు'! ఈ రెండవది చాలామంది 'కావాలనే' చేస్తున్న చర్య! తెలిసి చేసినా, తెలియక చేసినా ఈ చర్యల పట్ల ఎదుటివాళ్ళు బాధ పడ్తారనేది మాత్రం నిజం!
అలాగే మనపట్ల ఎవరైనా ఇలా ప్రవర్తిస్తే అలాంటి వాళ్ళను దూరం పెట్టడం శ్రేయస్కరం. ఎందుకంటే మన 'ఆత్మాభిమానం' కాపాడుకోవటం కూడా మన ప్రథమ కర్తవ్యం కావాలి కదా?!
అయితే ఇక్కడ మరో సున్నితమైన అంశం ఉంది... మనకి 'అవసరమైన' సందర్భాలలోనే 'అలాంటి' సంఘటనలు చాలావరకు ఎదురౌతాయి. కానీ అలాంటి సందర్భంలో దాన్ని పట్టించుకుని బాధపడటం అనవసరం!
మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే పోలికలతో ఎదుటివాళ్ళను 'తక్కువ' చేయటం! ఒక వ్యక్తికి విపరీతంగా 'ప్రాధాన్యత' ఇస్తూ... మరోవ్యక్తిని నువ్వు దేనికీ 'పనికి రావు' అన్నట్లు ప్రవర్తించటం!
ఇలా మనలో చాలామంది తెలియక... కొంతమంది తెలిసే చేస్తున్న పనులు ఇవి!
మనం ఒక సంఘటన పట్ల ఎలా అవమానంగా ఫీలౌతామో... మరొకరు కూడా అలానే బాధపడ్తారనే విషయం గుర్తెరిగి... ఎవర్నీ బాధించకుండా... మనల్ని బాధించే వ్యక్తులకు దూరంగా ఉందాం!
అలాగే ఎదుటి వాళ్ళ మనోభావాలను కించపరచకుండా ప్రవర్తిద్దాం!
అందరూ ఆనందంగా... ఆరోగ్యంగా ఉండాలని
కోరుకుంటూ...








ప్రముఖ కార్టూనిస్ట్ శ్రీబాచిగారు, తమ తల్లిగారు శ్రీమతి అన్నం భాగ్యవతి (బాచి) గారి స్మారకార్థం ఈ కార్టూన్ పోటీ నిర్వహిస్తున్నారు.

| మొదటి బహుమతి | రెండవ బహుమతి |
|---|---|
| రూ.5000/-లు, మెమెంటో+సర్టిఫికేట్ | రూ.3000/-లు, మెమెంటో+సర్టిఫికేట్ |
| **మూడవ బహుమతి** | **జ్యూరీ బహుమతులు** |
| రూ.2000/-లు, మెమెంటో+సర్టిఫికేట్ | రూ.500/-లు చొప్పున 10 బహుమతులు |




హాస్యాభిమాని, కార్టూనిస్టులు **శ్రీ.ఎస్.వి.రమణ గారు** తమ తల్లిదండ్రులు **శ్రీసోమయాజుల శివరామయ్య, శ్రీమతి హైమవతి గార్ల స్మారకార్థం** ఈ కార్టూన్ పోటీ నిర్వహిస్తున్నారు.

**ఒక్కో కార్టూన్ కి 1000 రూపాయలు చొప్పున10 బహుమతులు**

**ఒక ప్రముఖ కార్టూనిస్ట్‌కి సన్మానం**

✦ ఈ మెయిల్‌కి కార్టూన్లు పంపవలెను- **sreedhar.annam@yahoo.in**

✦ రెండు పోటీలకు విడివిడిగా కార్టూన్లు పంపవలెను.

**ఆగష్టు 15న** విజయవాడలో బహుమతి ప్రదానోత్సవం నిర్వహించబడుతుంది.
**బహుమతి పోస్ట్‌లో పంపడం జరగదు!** వివరాలు హాస్యానందం ఆగష్టు సంచికలో....

**కార్టూన్లు చేరవలసిన ఆఖరు తేదీ : 20-07-2025**







✦ **శ్రీలేఖ. పి.ఎస్. సికింద్రాబాద్**

'**చ**దివింపులు' కథ కొత్తగా సృజనాత్మకతగా ఉన్నది. 'అబ్బాయి పెళ్లి' కార్టూన్ హాస్యం బాగుంది. ఆలస్యం అమృతం విషం అన్నారు పెద్దలు. కానీ ... డబ్బు సంపాదన ముఖ్యం పెళ్లి జంటకు అని అందరు గుర్తు పెట్టుకోవాలి... లేకుంటే చాలా తంటాలు తెస్తాయ్. 'నవ్వే మందు' కార్టూన్ సూపర్.

✦ **పి. వి. పద్మావతి మధు నివ్రితి,హైదరాబాద్**

**న**వ్వు కొమ్మచ్చి కార్టూన్ అందరూ చూడాలి... చదవాలి. ఆంగ్లంలో అనువదించి మార్గాలంలో పెట్టమని విజ్ఞప్తి. ఈసారి సంపాదకులు రాముగారి 'హాయ్ సానందంగా' ఒక హెచ్చరిక! దగాకోరులు-నటించే వారు ఉంటారు తస్మాత్ జాగ్రత్త! లేకుంటే మన వ్యక్తిగత మరియూ వృత్తి జీవితం రెండు అధోగతి పాలవుతుంది. ఈ సారి ఫుల్‌స్టాప్-కామా(. ,) గురించి చక్కటి వివరణ ఇచ్చారు రామకృష్ణ గారు. అవి సరిగ్గా-సరి అయిన చోట పెట్టకుంటే అర్థాలు మారి పోతాయి!

✦ **కె.వి.రమణా రెడ్డి, హైదరాబాద్**

**జూ**న్ 2025 హాస్యానందంలో సరసిగారి కార్టూన్ 'నవ్వు కొమ్మచ్చి' తరచుగా హైదరాబాద్ నగరంలో అనుభవిస్తున్నదే... సరసిగారి స్వీయ అనుభవం అనుకుంట! అలాగే చదివింపులు కథలో జరిగే హాస్య సంఘటనలు చాలా కుటుంబాలలో జరగటం చుసాను. మిగతా కథలు, కార్టూన్లు నవ్వించాయి. ధన్యవాదాలు.

✦ **బి.వి.అనూరాధ, ముంబై**

**హా**స్యానందం ఆనందాన్నే కాదు... జీవనవిధానాల్ని కూడా చూపుతుంది... మన నడవడికలు ఎలా ఉన్నాయో...ఏం చేస్తున్నామో...ఏంచేయకూడదో...'నవ్వులపూతతో' అందిస్తున్న హాస్యానందం అంటే అందుకే మాకిష్టం!



## జన్మదిన శుభాకాంక్షలు!!

ప్రతి యేటా
తెలుగు కార్టూనిస్టుల దినోత్సవం
సందర్భంగా ఆయన చేతుల మీదుగా
బహుమతులందుకోవాలని...
ఉవ్విళ్ళూరే కార్టూనిస్టుల ఇష్టుడు...
కార్టూనిస్టులు...
హాస్యానందం ఆప్తులు...
**డాక్టర్ తనికెళ్ళ భరణి గారికి**
జన్మదిన శుభాకాంక్షలు!!
-హాస్యానందం

---

## హాస్యానందం సౌజన్యంతో నిర్వహిస్తున్న ఈ కార్టూన్ పోటీలను విజయవంతం చేయాలని మనవి!







**శ్రీ తోరహతుల వెంకటరత్నం,శ్రీమతి వనజాక్షమ్మ దంపతుల స్మారక పురస్కారం-2025**
(వారి జ్ఞాపకార్థం వారి కుమారుడు,కోడలు అందిస్తున్నారు)

**నగదు బహుమతి-5,116/-**
**జ్ఞాపిక+ ప్రశంసాపత్రం**
10 ప్రత్యేక బహుమతులు
**నగదు బహుమతి-1,116/-**
**ప్రశంసాపత్రం**

**శ్రీ తోరహతుల నాగేశ్వరరావు స్మారక పురస్కారం-2025**
(వారి జ్ఞాపకార్థం వారి తమ్ముడు,మరదలు అందిస్తున్నారు)

**నగదు బహుమతి-5,116/-**
**జ్ఞాపిక+ ప్రశంసాపత్రం**
10 ప్రత్యేక బహుమతులు
**నగదు బహుమతి-1,116/-**
**ప్రశంసాపత్రం**

**గమనిక:**
- కార్టూనిస్టు 3 కార్టూన్లు పంపవచ్చును.
- అసభ్యకరమైన కార్టూన్లు నిషేధం!
- క్యాప్షన్ ఏకవాక్యంలో ఉండాలి.
- విడివిడిగా ఎంట్రీలు పంపాలి.
- తుది నిర్ణయం న్యాయనిర్ణేతలదే. వాదోపవాదాలకు తావు లేదు.

కార్టూన్లు చేరవలసిన ఆఖరి తేదీ:
ఆగష్టు10, 2025

ఈ మెయిల్‌కి కార్టూన్లు పంపవలెను-
hasyanandampoteelu@gmail.com

ఫలితాలు సెప్టెంబర్,2025 హాస్యానందంలో ప్రచురించబడతాయి!


## ఈ నెల ప్రోత్సాహక బహుమతులు


**4000 రూపాయల బహుమతులు**

మన కార్టూనిస్ట్‌లను ప్రోత్సాహించాలనే సదుద్దేశంతో **ప్రతి నెలా** హాస్యానందంకు వచ్చిన కార్టూన్‌లలోంచి కొన్ని మంచి కార్టూన్లకు **ఇచ్చే ప్రోత్సాహక బహుమతులు.**



'కార్టూన్ మిత్ర'
**శ్రీ కె.వి.వి.సత్యనారాయణగారు**
**ఈ కార్టూన్‌కి రూ.1000/-లు**
బహుమతిగా ఇస్తున్నారు.











**శ్రీమతి నమ్మి మధుబాల**
**(బాపు రమణల లోగిలి-ఫేస్బుక్ గ్రూప్)**
కార్టూన్ కళ పై ఆరాధనతో... ఈ మూడు ప్రోత్సాహక బహుమానం ఇస్తున్నారు.


← మొదటి బహుమతి- **రూ.500/-లు**
↙ రెండవ బహుమతి- **రూ.300/-లు**
↓ మూడవ బహుమతి- **రూ.200/-లు**







కార్టూనిస్ట్ **శ్రీ జె.ఎస్.ఆర్.**
(జె.శ్రీరామచంద్రమూర్తి గారు)
వారి తల్లి దండ్రుల జ్ఞాపకార్థం
**ఈ కార్టూన్‌కి 500 రూపాయలు**
బహుమతిగా ఇస్తున్నారు.







**శ్రీ కుప్పచ్చి సుందరేశయ్య,**
**శ్రీమతి సత్యవతి వార్లు**
**ఈ కార్టూన్‌కి 500 రూపాయలు**
బహుమతిగా ఇస్తున్నారు.







కార్టూనిస్ట్
**ఎమ్.డి. రాజ్ మహమ్మద్ గారు**
ఈ కార్టూన్‌కి
**500 రూపాయలు**
బహుమతిగా ఇస్తున్నారు.






**దివ్యశ్రీ శ్రీమతి చిట్టావఝుల యల్లారి బాల వెంకట సత్య సూర్యకాంతం** జ్ఞాపకార్థం
కుమార్తెలు **మల్లిక, లక్ష్మీ** అందిస్తున్న
ప్రోత్సాహక బహుమానం-
**500 రూపాయలు**




## ప్రతి నెలా బహుమతులే!

కార్టూనిస్టు మిత్రులకు నమస్కారం. ప్రతి నెలా హాస్యానందంకు వచ్చే కార్టూన్లలోంచి **8 మంచి కార్టూన్లకు బహుమతులు** ఇస్తున్నారు కార్టూన్ ఇష్టులు! మీరు ఇక నుంచి పంపే కార్టూన్లకు బహుమతి రావాలనే ఉద్దేశంతోనే కార్టూన్లు గీయండి! సందేశాలున్నప్పటికీ హాస్యం మాత్రం 'మిస్' కాకుండ చూస్కొంటే... మీకు బహుమతి 'మిస్' అవ్వదు. ఆల్ ది బెస్ట్!



# సత్కళాభారతి సత్యనారాయణ గారికి
# వజ్రోత్సవ జన్మదిన శుభాకాంక్షలు

**సత్కళాభారతి సత్యనారాయణ గారికి** కార్టూనిస్ట్లకి చాలా ప్రేమ బంధాలు ఉన్నాయి. అప్పట్లో **సమైక్య భారతి** పేరుతో ఉండే ప్రముఖ కళా సంస్థకి కె.వి.రమణగారు గౌరవాధ్యక్షులు. ఈయన కార్యక్రమ నిర్వాహక కార్యదర్శి. వీరిద్దరూ మాత్రం కృష్ణార్జునలే. ఎన్ని కార్యక్రమాలు చేశారని... చేస్తున్నారని...చేస్తారని...

మొట్టమొదట 2011లో జాతీయస్థాయి కార్టూన్ మేళా అద్భుతంగా చేశారు. ఆ కార్టూన్ అనుబంధం నేటికీ కొనసాగుతోంది.

14 యేళ్ళ క్రితం మే 20న, తెలుగు కార్టూనిస్టుల దినోత్సవం జరుపు కుంటుప్పటి నుంచి... హాస్యానందం కార్టూన్ పోటీలు నిర్వహిస్తూ... బహుమతి ప్రదానాలు కొనసాగిస్తుందంటే దానికి కారణం కె.వి.రమణగారి సంపూర్ణమైన సహకారమే.

ప్రతి సంవత్సరం సభా మందిరం స్పాన్సర్ చేస్తున్నది మాత్రం మన సత్యనారాయణ గారు. ప్రతి సంవత్సరం మే 20న మళ్లీ వచ్చే సంవత్సరం మే 20 కి హాల్ బుక్ చేయడం ఆయన బాధ్యతగా తీసేసుకుంటారు.

అందుకే మన కార్టూనిస్టులు అందరికీ ఆయన బెస్ట్ ఫ్రెండ్!

**జూలై ఒకటో తారీకున మన సత్యనారాయణ గారి పుట్టినరోజు** అనే విషయం మనకు చాలామందికి తెలియకుండానే వెళ్ళిపోతోంది... కారణం ఆయన అమెరికాలో వుడుతూ ఉంటారు... ఈ సంవత్సరం మనకు దొరికిపోయారు. అందుకని కిన్నెర ఆర్ట్ థియేటర్స్, మద్దాలి రఘురాంగారు, మన సత్య నారాయణ గారి జన్మదినం సందర్భంగా ఒకటో తారీకుని ఒక అభినందన సభ లాంటిది పెట్టబోతున్నారు. ఇది మనందరికీ పండుగ రోజే.

మంచి రంగస్థల, టీవీ, సినిమా నటుడు మన సత్యనారాయణ గారు. వారు నిర్వహించే కార్యక్రమాలు ఏవీ చిన్నవి కావు... భారీ ఎత్తున భారతీయ స్థాయిలో సంగీత, నృత్య, సాహిత్య, కార్యక్రమాలు మూడేసి రోజులపాటు నడపడం ఒక ఎత్తు. అలాగే... సత్యనారాయణగారి హై స్కూల్ రోజుల నుంచి కల్చరల్ డే సందర్భంగా నాటకాలు నాటికలు వేయడం వేయించడం...

చదువుతోపాటు ఇంటర్ డిగ్రీ కళాశాలలో కూడా ఆయన నాటక రంగాన్ని కాలేజీ వ్యాప్తం చేశారు. ఇక రిటైర్ అయ్యాక చెప్పేదేముంది...పృథ్వి వెంకటేశ్వర్లు గారి శిష్యుడుగా గుమ్మడి గోపాలకృష్ణగారి సహనటుడుగా, సొంతంగా నాటక సంస్థలు నెలకొలిపి అనేక నాటకాలలో రాముడు, దుర్యోధనుడు, యమధర్మరాజు, కర్ణుడు మాతంగుడు... ఇలా అనేకనేక ప్రదర్శనలు ఇచ్చారు. దేశ విదేశాల్లో అనేక పురస్కారాలు అందుకోవడంతోపాటు... అవిభక్త ఆంధ్రప్రదేశ్ నిర్వహించిన నంది నాటకాల్లో ఆరు స్వర్ణనందులు అందుకున్న ప్రసిద్ధ కళాకారుడు. దూరదర్శన్లో కూడా అనేక కార్యక్రమాలు నిర్మాతగా దర్శకుడుగా, నటుడుగా వీరు పాల్గొన్నారు.

ఇంతటి ప్రజ్ఞావంతుడు మన కార్టూనింగ్కి చేస్తున్న స్నేహ సహకారాలకి కృతజ్ఞత తెలుపుకుంటూ... **జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నాం!**

-హాస్యానందం

















ప్రఖ్యాత రచయిత ముళ్ళపూడి వెంకటరమణ గారి పుట్టిన్రోజుసందర్భంగా నిర్వహించిన

# ముళ్లపూడి హాస్య కథల పోటీ ఫలితాలు

ప్రఖ్యాత రచయిత ముళ్ళపూడి వెంకటరమణగారి పుట్టిన్రోజు జూన్,28 సందర్భంగా హాస్యానందం వేదికగా **శ్రీ ఏవీ కృష్ణమూర్తిగారు** ఈ హాస్య కథల పోటీ నిర్వహించారు. పోటీకి 225 కథలు వచ్చాయి. అయితే చాలామంది రెండు పేజీలు రాస్తే మరికొంత మంది కాస్త పెద్ద'జోక్' రాసి పంపారు. ఇవి పరిగణలోకి తీసుకోలేక పోయాము. 'నిబంధనల'కు అనుగుణంగా రాసిన కథల్లోంచి ఈ 'పది' కథలని అక్షజ్ఞ పబ్లికేషన్స్ **శ్రీ వెంకట్‌విద్య గారు** న్యాయనిర్ణేతగా ఎంపిక చేశారు. ఈ కథలకు మా **గోపాలకృష్ణ** గారి బొమ్మలు అదనపు ఆకర్షణ.
ఈ పోటీని విజయవంతం చేసిన రచయిత, రచయిత్రిలకు ధన్యవాదాలు. విజేతలకు అభినందనలు! **-సం॥**



**నమస్కారం**
నేను హాస్యానందం మిత్రులందరి ప్రోత్సాహంతో ఈ సంవత్సరం కూడా ముళ్ళపూడి వెంకట రమణ గారి పేరున ఏర్పాటు చేసిన కథల పోటీకి బహుమతులు సమర్పిస్తున్నందుకు ఆనందిస్తున్నాను. ఒక పది కథలు పదిమంది రచయితలకి అందిద్దామన్న నా సంకల్పానికి మంచి ఆదరణ లభించి ఎందరో రచయితలు స్పందించి కథలు పంపిస్తున్నందుకు ధన్యవాదాలు.
ఎంపిక ఈసారి అక్షజ్ఞ పబ్లికేషన్స్ విద్యా వెంకట్ గారికి ఇవ్వడం జరిగింది. వారు పది కథలని ఎంపిక చేయడంలో చూపిన శ్రద్ధకి ధన్యవాదాలు.
ముఖ్యంగా హాస్యానందం రాముగారు చేస్తున్న కృషిని పదేపదే అభినందిస్తున్నాను.

**-ఏవీ కృష్ణమూర్తి**

**ము**ళ్లపూడి వెంకటరమణగారి పుట్టినరోజు సందర్భంగా నిర్వహించిన కథల పోటీలో చాలామంది వారి రచన నైపుణ్యంతో కథలని పంపారు. పోటీకి వచ్చిన ప్రతి కథ చాలా బాగుంది. ప్రతీ కథలో రచయిత యొక్క ప్రత్యేకత ప్రతిబింబించాయి, వారి దృష్టికోణం, ఆలోచన, కథను అల్లిన తీరు, స్పష్టంగా చూడగలం. అన్ని కథలు బాగున్నా పది కథలకే బహుమతులన్నారు కాబట్టి ఈ పది కథలు ఎంపిక చేసాము. ఈ కథల ఎంపిక ప్రక్రియలో, ప్రతీ కథను దాని స్వతంత్రత, హాస్య చతురత, పాత్రలను మలిచిన తీరు, మరియు భాషా నైపుణ్యాలను పరిగణనలోకి తీసుకుని ఎంపిక చేయబడింది. ఈ కథలు పాఠకులకు ఒక కొత్త అనుభవాన్ని అందిస్తాయని ఆశిస్తూ ...



**-వెంకట్ విద్య, అక్షజ్ఞ పబ్లికేషన్స్ (న్యాయనిర్ణేత)**

ఇది వరస...


| | | |
|---|---|---|
| భజనకు వేళాయెరా! | -సరసి | -12 |
| గిఫ్ట్ | -నిష్ఠల విజయ శంకర్ | -14 |
| జోగీ జోగీ రాసుకుంటే... | -సింహాద్రి నాగశిరీష | -16 |
| చిలక జోస్యం | -జి.రంగబాబు | -18 |
| ట్రం'పికిల్స్' | -శింగరాజు శ్రీనివాసరావు | -20 |
| సీక్రెట్ ఏజెంట్స్! | -పి.వి.రామశర్మ | -22 |
| బస్‌జర్నీ | -లేపాక్షి | -24 |
| మంగతాయారూ మహిమాన్వితమూ... | -వాడపల్లి పూర్ణ కామేశ్వరి | -26 |
| విష్ణుమాయ | -మోచర్ల అనంత పద్మనాభరావు | -28 |
| చిట్టి-ఫామిలీ సాంగ్ | -విశాలి పేరి | -30 |



ముళ్ళపూడి వెంకటరమణ హాస్య కథల పోటీలో

బహుమతి పొందిన కథ

# భజనకు వేళాయెరా!



సరసి
9440542950

**విశ్నాధం ఇంట్లో మహోజ్వలంగా సాగుతోంది పేకాట.**

**"నాన్నా... చంటాడు పడుకున్నాడు కాస్త చూస్తూ ఉండు. నేనలా రైతు బజారు కెళ్ళి రెండు కూరలు కొనుక్కొస్తా!" అంది కూతురు.**

**"నడిచెళ్ళి ఎప్పటికొస్తావమ్మా. స్కూటరేసుకెళ్ళు. అదిగో తాళం మేక్కుంది."**

ఆమె ఇలా వెళ్లిందో లేదో చంటాడు లేచి కొంపలంటుకు పోయినట్టు ఏడుపు లంకించు కున్నాడు. విశ్నాధం ఉలిక్కిపడి, లేచి వెళ్లి మనవడిని ఎత్తుకున్నాడు. తడిగా తగిలింది. చూస్తే వాడి 'లోతట్టు ప్రాంతం' జలమయమై పోయి వుంది.

"ఉళ ఉళ ఆయీ" అంటూ భుజం ఎగరేస్తూ తీసుకొచ్చాడు.


ఏడుపాగలేదు. పేకాట ఆగిపోయింది!

"ఎవరన్నా ఓ పాట పాడండ్రా!" అన్నాడు విశ్నాధం.

"నాకు రావు బాబూ!" అన్నాడొక పేకాటవికుడు పెళ్ళికూతురులా సిగ్గుపడుతూ.

"రావు కానీ ఆశువుగా పాడమంటే పాడతా... ఆటీన్ రాణీ ఇస్పేటు రాజు ఇద్దరూ పెళ్ళిచేసు కుంటారు... తూ తూ బాకాలు మోగాయి..." అంటూ అతడలా నోరు తెరవగానే అపస్వరాలు గుప్పున కంపుకొట్టేయి. అందరూ చెవులూ ముక్కులూ మూసుకుని హాహా కారాలు చేశారు. ఈలోగా మరొకడు నోరు చేసుకున్నాడు–

"అయయ్యో చేతిలో డబ్బులు పోయెనే..." అంటూ. ఆ గాయకుడు అంతకు ముందే 'ఫుల్ కౌంట్' ఇచ్చి గోడకి జరిగి పోయినవాడు.



"నేను పాడతా(నా చూడండి... పోతే పోనీ పోరా ఈ పాపపు జగతిని శాశ్వతమెవరురా!" వణుకుతూ సహజ గమకాలు పలికించాడొక వృద్ధ చీట్లాటవికుడు.

"ఆపరా శనికొట్టు పీనుగా! చావు పాటలెందుకురా? అసలే అందరం అరవై ఏళ్ళు దాటిన వాళ్ళం." వెంటనే అతడి నోరు మూయబడింది.

ఈలోగా పిల్లాడు మళ్ళీ విజృంభించాడు. 'దమ్ముంటే వూరుకోబెట్టండి' అన్నట్టు మధ్యమం నుంచి తారాస్థాయిలోకి తీసుకెళ్ళాడు ఏడుపుని. అందరూ వణికిపోయారు ఆ వైబ్రేషన్స్ తట్టుకోలేక. ఏం చెయ్యాలో బోధ పడలేదెవరికీ. ఒక పక్క పేక ముక్కలు దిక్కులేని పక్షుల్లా దీనంగా చూస్తున్నాయి చాపమీద!

ఈలోగా "రామయ తండ్రి ఓ రామయ తండ్రి మా నోములన్ని పండినాయి రామయ తండ్రి!" అంటూ ఓ పాట శ్రావ్యంగా వినిపించింది. అంతే! చటుక్కున ఏడుపాపేశాడు చంటాడు!!

ఆ సౌండ్ 'అశరీరవాణిదేమో' అని ఆకాశం వంక కొందరూ... కిటికీలోకి కొందరూ చూసారు... ఓ బిచ్చగాడు తన్మయత్వంతో పాడుతూ దర్శనమిచ్చాడు వీధి గుమ్మంలో!

"దేవుళ్ళా వచ్చా(డా! వాడిచేత కాసేపు పాటలు పాడిస్తే పిల్లాడు శాంతిస్తాడు. లోపలికి పిల వండి" అన్నాడొకడు.

బిచ్చగాడు లోపలికి వస్తూనే పేక ముక్కల్ని చూసి, తనని కూడా ఆడటానికి పిలిచారేమో అనుకుని కూర్చుంటూ– "ఓక్కెంత సార్?" అన్నాడు జోలెలోంచి డబ్బులున్న సత్తుగిన్నె బయటకు తీస్తూ.

"మా తండ్రే" అంటూ అతడి వంక జాలిగా చూసి, కర్తవ్య బోధ చేశాడొకడు. సంచిలోంచి తాళాలు తీసి వాయిస్తూ రెండు భజన పాటలు పాడేడు బిచ్చగాడు.

అద్భుతం! కేరింతలు కొడుతూ చప్పట్లు కొట్టేడు చంటాడు! అంతవరకూ పేక కలిపిన చేతులు ఆ పాటలకి తాళం కలిపాయి అప్రయత్నంగా!

ఇంతలో కూరలకెళ్ళిన అమ్మాయి వచ్చింది.


"నేను నడిచి వెళతానంటే స్కూటర్ మీద వెళ్ళమన్నావు. రైల్వే గేటు వేసేశారు. అందుకే లేటయింది." అంటూ చంటాడిని ఎత్తుకుని వెళ్ళబోతూ ఆగి– "చక్కగా భజన చేస్తున్నారు. ఈ వెధవ పేకాట మానేసి చక్కగా భజన చేసుకోవచ్చుగా రోజూ!" అనేసి లోపలికి వెళ్ళిపోయింది.

ఒక్క నిమిషం నిశ్శబ్దం! బుర్ర గోక్కుంటూ ఒకరూ, సిగ్గులో ముడుచుకుపోతూ ఒకరూ, పిచ్చి చూపులు చూస్తూ మరొకరూ...

"అవున్రా! ఇంత కాలం మనం ఎంతో సమయం, డబ్బు తగలేశాం. వయసు చూస్తే ఇంటర్వెల్ దాటిపోయి శుభం కార్డుకి దగ్గరగా ఉన్నాం... 'కృష్ణా రామా...' అనుకోవాల్సిన టైములో 'కళావరాసు, ఆటీన్ రాణి' స్మరణ ఎందుకురా? పుణ్యమా పురుషార్థమా? చాలు. దీనికి స్వస్తి చెప్పి, రేపటి నించి భజన చేద్దాం. పాటల పుస్తకం నేను కొనుక్కొస్తా." అన్నాడొకాయన.

"నిజమే! ఇంట్లోవాళ్ళు ఎన్ని తిడుతున్నా దులుపేసుకున్నాం ఇంతకాలం. మన పెళ్ళాల వల్ల కానిది ఈ పసిపిల్లాడు చేశాడు. పెద్దరికం మంట కలిసి చివరికి జోకర్ల మయ్యాం!" అన్నాడు మరొకడు.

చెల్లా చెదురుగా పడున్న పేకముక్కల్ని ఏరి, చింపి... కిటికీ లోంచి బైటకు విసిరేశాడు విశ్వనాథం... ఓ వంద నోటు తీసి బిచ్చగాడి జోలెలో వేసి దణ్ణం పెట్టాడు.





ముళ్ళపూడి వెంకటరమణ హాస్య కథల పోటీలో

బహుమతి పొందిన కథ

# గిఫ్ట్



నిష్ఠల విజయ శంకర్,
9849284739

**ఆదివారం సాయంత్రం సరిగ్గా ఆరుగంటలు. మొబైల్‌లో అలారమ్ మోగింది. మొబైల్‌లో అలారమ్ విని... 'ఎన్ని రోజులనుండి ఎదురుచూపులు చూసేం ఈ అలారమ్ మోతకోసం? ఇన్నాళ్లూ మూఢమని, తర్వాత అధిక మాసమని, పెళ్లి భోజనాలు లేక... విల విల లాడిపోయాము' అనుకున్నాడు మూర్తి.**

**ఫంక్షన్స్ మర్చిపోకుండా ఉండడానికి అలారమ్ పెట్టుకోవడం మూర్తికి అలవాటు.**


"ఏమోయ్ మంగతాయారు... ఇవాళ హోటల్ తాజ్‌కృష్ణాలో.. డేవిడ్ రాజ్‌గారి అబ్బాయి జోసెఫ్ రాజు పెళ్లి రిసెప్షన్. తొందరగా రెడీ అవ్వు!" అరిచాడు, మూర్తి మొబైల్‌లో పెళ్లి ఇన్విటేషన్స్ చూస్తూ.

"ఆ అవునా! అలారమ్ మోగిందా?" అయినా... నాకీ పెళ్ళికి రావడం ఇష్టం లేదు. ఆ మధ్యనే కదా... ఫిలిప్స్‌గారి మనుమడి పెళ్లి ఫంక్షన్‌కి అటెండ్ అయ్యాము!" అంది కిచెన్ లోంచి కాఫీ కప్ పట్టుకొస్తూ.

"అయినా ఇంట్లో కూడా నాన్‌వెజ్ తెగ తింటున్నాము. ఇప్పుడీ రిసెప్షన్ కొచ్చి నాన్‌వెజ్ చూస్తే మళ్ళీ టెంప్ట్ అవుతా! రోగం తెచ్చుకుంటా. బాబోయ్ నేను రాను!" అంది మంగతాయారు కప్ అందిస్తూ.

"మరదే! వద్దన్నా చికెన్ బిర్యానీ బాగుందని ఆ రోజు రెండు ప్లేట్స్ లాగించిందెవరో?..." కప్‌లో కాఫీ సిప్ చేస్తూ అన్నాడు మూర్తి .

"అవుననుకోండి... ఇవాళ నాన్‌వెజ్ పూర్తిగా బంద్. బ్యాంక్ మేనేజర్ రామమూర్తిగారి అమ్మాయి పెళ్లి! ఎంచక్కా దసపల్లా హోటల్‌లో అవుతోంది. అక్కడయితే నాన్‌వెజ్ ఉండదు!" అంది మొబైల్‌లో పెళ్లిళ్ల లిస్ట్ చూస్తూ.



"ఇంకా అక్కడికెళ్తే... చక్కగా గోంగూర పచ్చడి, పప్పన్నం సాంబారు వగైరా వగైరా... శాకాహార వంటలు తినొచ్చు. ఏమంటారు?" అంది మంగతాయారు.

"ఛ!... ఆదివారం పూట అప్రియమైన మాటలు ఆడకు... తాజ్‌కృష్ణాలో అయితే ఎంచక్కగా చికెన్ బిరియాని, మటన్ పులావ్ ఇంకా ఎన్నో రకాల ఐటమ్స్ పెడతారు... వంటల్లో 'రొయ్యల పులుసు', 'క్రాబ్ కర్రీ" ఏర్పాటు చేసేరంట... ఇందాకే తాజ్‌కృష్ణకి ఫోన్ చేసి మెనూ కనుక్కున్నా."

"నాకు ఈ మధ్య అజీర్తి చేసింది కదండీ... అందుకే వద్దంటున్నా!" అంది కొంటెగా... మూర్తి కుడి భుజం మీద వేలు పెట్టి రాస్తూ...


వెంటనే చప్పున చల్లారిపోయాడు మూర్తి.

"అయితే ఇంకేమైనా పెళ్ళిళ్ళు ఉన్నాయేమో చూడు మన వాళ్ళవి!" భార్య బాధను అర్థం చేసుకున్న మూర్తి... "మనకు దగ్గర్లో ఉండాలి సుమా!" అన్నాడు

"చూస్తానుండండి" అని మొబైల్‌లో, ఆ రోజున్న ఫంక్షన్స్‌లిస్ట్ చూడడం మొదలెట్టింది మంగతాయారు.

'ఆ! దొరికిందండి ప్రొఫెసర్ రంగనాథం గారి అబ్బాయి పెళ్లి.యూనివర్సిటీ కాన్వొకేషన్ హాల్లో రాత్రి 10 గంటలకి ముహూర్తం. ఏడు గంటలు నుండి విందు ఏర్పాటు చేసేరంట. మనకి వాకబుల్ డిస్టెన్స్!" చెప్పింది.

"వంటలేమిటో ఆ ఆర్గనైజర్లుకి ఫోన్ చేసి కనుక్కో."




"అలాగేనండి."

ఆర్గనైజర్లు ఫోన్ నంబర్స్ చూసి ఫోన్ చేసింది మంగతాయారు.

"ఆ! ఓన్లీ వెజిటేరియెన్ ఐటమ్స్ పెట్టారా? 10 రకాల టిఫిన్స్ ఏర్పాటు చేసేరా? రిటర్న్ గిఫ్ట్ కూడా ఇస్తారా? ఓకేనండి. థాంక్యూ అండీ..." ఫోన్ పెట్టేసింది తాయారు.

"సరే... ఇక లేట్ ఎందుకు, రెడీ అవ్వు! చక్కగా దగ్గరలోనే కదా! భోంచేసి వద్దాము."

"మరి గిఫ్ట్ ఎలాగండి?" ఎప్పుడూ అడిగి నట్టే అడిగింది.

"గిఫ్ట్ ఎందుకే పిచ్చి మొహమా!.. మనం వెళుతున్నదే పిలవని పేరంటాలకి, పెళ్ళిళ్ళకి. మనం పెళ్ళికి వెళ్లడమే వాళ్ళకి పెద్ద గిఫ్ట్..." ఎప్పుడూ చెప్పినట్టే చెప్పాడు మూర్తి.

"అంతేనంటారా?" నవ్వుతూ అంది.

అంతేగా! అంతేగా!... గుండె ఉన్నవాడికే గుండె నొప్పి మనకది లేదుగా!..." అంటూ సూటు, బూటు వేసుకోవడానికి... గదిలోకి వెళ్ళాడు వామనమూర్తి.

సింగారించుకోవడానికి వేరే గదిలోనికి పరుగులు తీసింది మంగతాయారు.

భార్యాభర్తలిద్దరూ పెళ్లికని స్కూటర్ మీద బయలు దేరేరు.

ఏమయిందో తెలియదు కాని మర్నాడు ఉదయం ఇద్దరూ కెజీహెచ్‌లో ఆర్థోపెడిక్ వార్డ్‌లో ఒకరికి కాలు, ఒకరికి చెయ్యి విరిగి కట్లతో మంచాల మీద మూలుగుతూ తేలేరు.

పెద్ద డాక్టర్ రౌండ్స్‌కి వచ్చాడు.

"ఆక్సిడెంట్ ఎలా అయ్యింది?" అడిగాడు.

"పెళ్ళికని బయలు దేరాము డాక్టర్. రాత్రి సడన్‌గా గేదె అడ్డొచ్చినట్టుంది... ఇలా అవుతుందని అనుకోలేదు డాక్టర్!" అన్నాడు ఏడుపు ముఖమేసుకుని మూర్తి.

"సరే, సరే... జాగ్రత్తగా చూసుకుంటూ నడ పాలి బండి!" అని...

"ఏమైనా తిన్నారా?" అని అడిగాడు.

"రాత్రి నుంచీ ఏమీ తినలేదు డాక్టర్!" అన్నారు ఇద్దరూ ఒకేసారి ఏడుపు ముఖంతో.

"నర్స్! వీళ్ళకి బన్ను రోటీ గాని, జావ గాని పెట్టు!" అని రౌండ్స్ కి వెళ్ళిపోయాడు, డాక్టర్.

"ఆ! జావగాని, బన్ను రోటీయా?" అని నోర్లు వెళ్లబెట్టేరు ఆ దంపతులిద్దరూ.





**ముళ్ళపూడి వెంకటరమణ హాస్య కథల పోటీలో**

**బహుమతి పొందిన కథ**

# జోగీ జోగీ రాసుకుంటే...



సింహాద్రి నాగశిరీష,
9866689326

**"ఏమండోయ్!...పెళ్ళికి బయలుదేరవలసింది రేపే కదా!... ఇంతకీ టికెట్స్ కన్ఫర్మ్ అయ్యాయో లేదో చూశారా?" కొంచెం గాబరాగా అడిగింది కోమలి.**

**"చూశాను ప్రియతమా! కన్ఫర్మ్ అయ్యాయి..." చెప్పాడు మాహి.**

**"వామ్మో! ఏవిటీ పైత్యం!" భయంగా చూసింది కోమలి.**

"పైత్యం అంటావేంటి... డార్లింగ్ అంటే తెలుగులో ప్రియతమా అనే గూగుల్ చూపించింది. తెలుసా?" సగర్వంగా చెప్పాడు మాహి.

"ఓహో... ఇదంతా డార్లింగ్‌కి వచ్చిన తిప్పలా?" కళ్ళు బొంగరంలా గిరగిరా తిప్పేసింది కోమలి.

"మరి ఒక తెలుగు రచయిత్రికి మొగుణ్ణి, తెలుగు సరిగా రాకపోతే ఎలా? అందుకే బాగా తెలుగు నేర్చేసుకుంటున్నాను!" పట్టువదలని విక్రమార్కునిలా చెప్పాడు మాహి.

✦✦✦

పొద్దుటే ఆదరాబాదరా ట్రైన్ ఎక్కేశారు ఇద్దరూ.

"ఏమండీ! మరేమో....మీకొకటి చెప్పాలి!"


"ఒకటేమిటి... వంద చెప్పు ప్రియతమా!"

"ఇదిగో ఈ పైత్యమే వద్దండీ... అసలే మనం వెళుతోంది పల్లెటూరికి. అక్కడ దయచేసి మీరు తెలుగు మాత్రం మాట్లాడకండి! "

"ఏం... ఎందుకూ?"

"ఎందుకా? అసలే పల్లెటూరు. అక్కడ ఏది పడితే అది మాట్లాడకూడదు. అర్థాలమాట దేవుడెరుగు... అపార్థాలు అయిపోగలవ్ జాగ్రత్త!... పైగా మీ ఇంగ్లీషు మీడియం తెలుగు అంతంత మాత్రం. దానికి తోడు అస్తమానం, ఆ గూగుల్లో వెతుకులాడుతుంటారు. ఆ తెలుగుతో నా కొంపెక్కడ ముంచేస్తారో అని నా భయం"

బెంబేలుపడిపోయింది కోమలి.



ఓపక్క ఉడుక్కుంటూనే తల ఊపాడు మాహి. మొత్తానికి ఊళ్ళో దిగారు ఇద్దరూ.

పెళ్లివారి ఇల్లు చిన్నది... దాంతో ఆ ఊరి మునసబుగారి పాత ఇల్లు ఖాళీగా ఉండటంతో, దాన్ని బాగుచేయించి, పెళ్ళివారికి విడిది ఏర్పాటు చేశారు. వీళ్లు కూడా కొత్త దంపతులు కావటంతో అక్కడే ఒక గదిని వీళ్లకు కూడా కేటాయించారు. తిన్నగా విడిదికే వెళ్ళి, కాస్త ఫ్రెష్ అయి పెళ్లివారింటికి వెళ్ళారు.

పెళ్లి వారిల్లు ఎంతో సందడిగా, బంధువులతో కిటకిటలాడుతోంది. బయట మొత్తం పందిరి వేసేశారు. అక్కడే ఓ పక్కగా భోజనాలు చేస్తున్నారంతా. కాస్త ఎంగిలిపడి...

"ఏమండీ! పెళ్ళి కూతుర్ని పలుకరించి వద్దామా?" అంది కోమలి.

'నేనెందుకు?... అక్కడ అందరూ ఆడాళ్లే... నువ్వు మాట్లాడు. నేను రాత్రికి పెళ్ళిలో కలుస్తాలే." అని చెప్పి వెళ్ళిపోయాడు మాహి.


✦✦✦

రాత్రి చక్కగా ముస్తాబై పెళ్లి ఇంటికి బయల్దేరారు ఇద్దరూ. అక్కడకు చేరుకునేసరికి ఏదో గొడవగా ఉంది... ఏమీ అర్థంగాక చూస్తూ నిలబడ్డారు. పెద్దమనుషులు సర్ది చెబుతున్నారు. కాసేపటికి అంతా నెమ్మదించింది. పెళ్లి తంతు పూర్తయింది.

పక్కనే ఉన్న పెద్దామెకు దగ్గరగా జరిగి...

"ఏంటి పెద్దమ్మా! ఇందాక ఏదో గొడవ జరిగినట్టుంది" అడిగింది కోమలి.

"వాయమ్మో... పెద్ద గొడవే జరిగిందమ్మా!




పెళ్ళికూతుర్ని వేవిళ్ళు తగ్గాయా అని అడిగాడట పెళ్ళికొడుకు!" అంది బుగ్గలు నొక్కుకుంటూ పక్కనే ఉన్న ముసలమ్మ.

"పెళ్లికూతురికి వేవిళ్ళేంటి అసహ్యంగా." నొసలు చిట్లించింది కోమలి.

"ఆ పిల్ల ఏడుస్తూ అమ్మానాన్నలకు చెప్పిందట. ఆ పిల్ల తండ్రి పిచ్చి కోపంతో ఊగిపోతూ గొడవకెళ్లాడు. ఆ పెళ్ళికొడుక్కి తెలుగు సరిగా రాదు... చిన్నప్పటినుండి ఇంగ్లీష్ మీడియం, పైగా వీడికి ఎవడో తలకుమాసిన వాడు అలాగే చెప్పాడట... వీడి తప్పేం లేదు అని పిల్లాడి తరపువాళ్ళు బ్రతిమాలి, నచ్చజెప్పి... చివరికి పెళ్లిచేశారు!" ముసిముసిగా నవ్విందామె.

'ఓసోస్! ఇంగిలీసు పెళ్ళికొడుకులు...' అంటూ అక్కడున్న ముసలోళ్ళంతా బోసి నవ్వులు నవ్వేశారు.




పక్కనే ఉన్న మాహి ముఖం ముడుచుకున్నాడు. అది గమనించిన కోమలి కిసుక్కున నవ్వింది.

పెళ్లితంతు పూర్తయ్యాక, కొత్త దంపతులను కలవాలని భర్త కోసం వెతికింది కోమలి. కానీ పందిట్లో ఎక్కడా కనబడకపోవడంతో ఒక్కతే వాళ్ళని కలిసి, ఉదయాన్నే వెళ్ళిపోతున్నామని చెప్పి విడిదింటికి వెళ్ళిపోయింది. అప్పటికే నిద్ర పోతున్నాడు మాహి.

ఉదయాన్నే తిరుగు ప్రయాణమయ్యారు.

ట్రైన్ కదిలాక, "కోమలీ!" బెరుగ్గా పిలిచాడు మాహి.

"అదేంటీ... ప్రియతమా పోయి కోమలీలోకి వచ్చారు?" కొంటెగా అడిగింది.

'మరేమో.... పెళ్ళికూతుర్ని అలా అడగమని పెళ్ళికొడుక్కి చెప్పింది నేనే... మొన్న భోజనాల దగ్గర మీరంతా పెళ్ళికూతురికి, వంటల్లో ఏదో సరిపడక వాంతులు అవుతున్నాయని అనుకున్నారుగా.... అది విన్నాను. అదే రోజు విడిదిలో నాకు పెళ్ళికొడుకు పరిచయమయ్యాడు. పెళ్ళికూతురితో మాట్లాడాలని అతను ముచ్చటపడుతుంటే.. విషయంచెప్పి, వాంతులు అంటే మరీ పేషెంట్ ఫీల్ వస్తోందని వేవిళ్ళు అనమని చెప్పా!" పళ్ళికిలిస్తూ చెప్పాడు మాహి.

"ఓరినాయనో.... ఇదంతా మీ నిర్వాకమా. కొద్దిలో తప్పిపోయింది గానీ.... లేకపోతేనా.. వామ్మో! ఇద్దరూ ఇద్దరే... జోగీజోగీ రాసుకుంటే బూడిదరాలడమంటే ఇదేనేమో...." అనుకుంటూ తల కొట్టుకుంది కోమలి.



ముళ్ళపూడి వెంకటరమణ హాస్య కథల పోటీలో

బహుమతి పొందిన కథ

# చిలక జోస్యం



జి.రంగబాబు,
9440190669

**అది ఒక రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయం.**

**అందులో పనిచేస్తున్నాడు పెళ్ళికాని ప్రసాద్. అతనికి ముప్పై ఐదు ఏళ్లు వచ్చినా ఇంకా పెళ్లి కాకపోవడంతో అందరూ అతన్ని పెళ్లి కాని ప్రసాద్ అని పిలుస్తుంటారు.**

**ఆ రోజు అతని బైక్‌ని ఆఫీసుకు దగ్గరలోనే ఉన్న ఒక బైక్ మెకానిక్ షాప్‌లో సర్వీ సింగ్‌కి ఇచ్చాడు, ఉదయం ఆఫీసుకు వచ్చినప్పుడు.**

**ఆఫీస్ అయిపోగానే ఆ బైక్‌ని పికప్ చేసుకోవడానికి ఆఫీస్ నుండి నడిచి వెళుతున్నాడు, తనకు ఎప్పుడు పెళ్లి అవుతుందా అని ఆలోచిస్తూ...**

ప్రసాద్ ఆస్తిపరుడే. తండ్రి నుంచి కొంత ఆస్తి కలసి వచ్చింది. డిపార్ట్‌మెంట్ నుండి లోన్ తీసుకుని అపార్ట్‌మెంట్ కూడా కొన్నాడు.

అయినా అతనికి పిల్లనివ్వడానికి ఎవరూ ముందుకు రాలేదు.

జాతకాలు కలవలేదనో, రంగు తక్కువనో కారణాలు చెప్పి వెనక్కి పోతున్నారు.

'పెళ్లి ఎలా జరుగుతుందా' అని ఆలోచిస్తూ రోడ్డుపై నడుస్తున్న ప్రసాద్‌కి రోడ్డు ప్రక్కన ఫుట్‌పాత్ మీద ఒక చిలకజోస్యం చెప్పే జ్యోతిష్యుడు కనిపించాడు.

వీడిని అడిగితే చెబుతాడేమో తన పెళ్లి సంగతి అనుకుంటూ అటువైపు దారి తీశాడు.

అక్కడ ఒక జ్యోతిష్యుడు , ప్రక్కనే బోనులో ఒక చిలుక.


ఈ చిలుక చెప్పింది అయినా జరుగుతుందేమో అని అతణ్ని చిలక జోస్యం చెప్పమన్నాడు.

ఆ చిలక జోస్యుడు బోనులో ఉన్న అతని చిలుకను–

"రావమ్మా సమంతా! నీ కోసం అయ్యగారు వచ్చారు. దీనిలోనుండి ఒక కార్డు తీయమ్మా!" అని బోను తలుపు తీశాడు.

బోనులో నుండి చిలుక చక చక నడుచు కుంటూ బయటకు వచ్చి తన ముక్కుతో ఒక కార్డు తీసి అక్కడ పడేసి మళ్ళీ బోనులోనికి వెళ్ళిపోయింది.

కుతూహలంగా చూశాడు ప్రసాద్.



జ్యోతిష్యుడు– "సార్ మీరు అదృష్టవంతులు సార్! సంవత్సరం తిరగకుండానే మీరు ఒక ఇంటివారు అవుతారు. ఇది మా చిలకమ్మ మాట." అన్నాడు.

సంతోషంగా జ్యోతిష్యునికి యాభై రూపాయలు చెల్లించి ఆనంద పడిపోయాడు పెళ్ళికాని ప్రసాద్.

కొన్ని నెలలు గడిచాయి.

పెళ్ళికాని ప్రసాదు ఆఫీసులో టెంపరరీ కుర్రవాడైన రాజుకి పది లక్షల చీటికి గ్యారెంటీ ఇచ్చాడు తాను. మొదటి పాటే పాడేసుకుని మరి కనపడకుండా పారిపోయాడు వాడు.

ఆ చీటీ వాళ్లు పెళ్ళికాని ప్రసాద్‌ని పట్టుకుని మొత్తం కట్టమన్నారు.

పాపం ప్రసాదు తన తండ్రి ఇచ్చిన పాత ఇల్లు అమ్మేసి బాకి తీర్చేద్దామనుకొని అమ్మకానికి పెడితే పదిహేను లక్షలు వచ్చింది.

వాళ్ళకి కట్టేసాడు.

పెళ్లి జరగకపోగ ఇదొకటి... గోటి చుట్టు మీద రోకటి పోటులా అనిపించింది ప్రసాద్‌కి.

కొద్ది రోజులు గడిచాక ప్రసాద్‌కి మళ్ళీ ఆ చిలక జోతిష్యుడు కనబడ్డాడు.

ఒళ్ళు మండిపోయింది ప్రసాద్‌కి.

వాడి దగ్గరకు నేరుగా పోయి...

"ఏమయ్యా! నీకు అసలు బుద్ధుందా?... నువ్వు చెప్పిందేంటి జరిగింది ఏంటి? పెళ్లి జరిగి చక్కగా భార్యతో కాపురం చేసుకుంటాను అనుకున్నాను. కానీ నాకున్న రెండిళ్లలో ఒక ఇల్లు అమ్మేసి అప్పు తీర్చవలసి వచ్చింది. పెళ్లికి దిక్కే లేదు... దిక్కుమాలిన జీవితం అయిపోయింది. ఇదేనా జాతకం చెప్పడం? నీదేం శాస్త్రమయ్యా? తగలబెట్టుకో!..." అన్నాడు కోపంగా.

"బాబూ!... నన్నేమైనా అనండి. భరిస్తాను. నా శాస్త్రాన్ని మాత్రం తిట్టకండి... మీకు పుట్టగతులు ఉండవు. నా శాస్త్రం ఎప్పుడూ నిజమే చెబుతుంది కానీ అబద్ధం చెప్పదు... నేనేం చెప్పాను!? మీరు ఒక ఇంటివారు అవుతారు అని చెప్పాను. దాన్ని మీరు మరోలా అర్థం చేసుకుంటే నేనేం చెయ్యను? మీకు ఎన్ని ఇళ్లున్నా నాకు అనవసరం....

సంవత్సరం తిరిగే సరికి ఒక ఇంటివారు అవుతారు అన్నాను. అలాగే జరిగింది. మీరు ఒక ఇంటి వారు అయ్యారు కదా! ఇంకెప్పుడూ నా శాస్త్రాన్ని అవమానించకండి. వెళ్లి రండి బాబూ!" అన్నాడు.

అప్పటికే పెళ్ళికాని ప్రసాద్ ఫిట్స్ వచ్చిన వాడిలా క్రింద పడి గిలగిలా కొట్టుకుంటున్నాడు.








ముళ్ళపూడి వెంకటరమణ
హాస్య కథల పోటీలో

బహుమతి పొందిన కథ

# ట్రం‘పికిల్స్’



శింగరాజు
శ్రీనివాసరావు,
9052048706

**“అమ్మా!...ఈ సంవత్సరం ఆవకాయ, మాగాయతో పాటు చింతకాయ, ఉసిరి ఆవకాయ, ఉసిరి తొక్కుపచ్చడి, గోంగూర, దబ్బకాయ అవి కూడ పంపు. కొంచెం ఎక్కువే పంపమ్మా! ఇక్కడ మా స్నేహితులకు కూడ ఇస్తాను!” ఆర్డరు జారీచేసింది అమెరికాలో ఉద్యోగం వెలగబెడుతున్న పల్లవి కూతురు పరిణయ.**

“మేమిక్కడేమైనా పచ్చళ్ళ కొట్టు పెట్టామటే.. అన్ని రకాలు పంపడానికి. అసలు మీ అమ్మ వయసెంతో నీకు గుర్తుందా? అలా ఆర్డర్లు వేస్తున్నావు?” కూతురి మాటలు విని కసురుకున్నాడు తండ్రి పృథ్వి.


“అమ్మా! నువ్వు ఆ స్పీకరు ఆపేసి మాట్లాడు. లేకుంటే నాన్న మధ్యలో దూరేస్తారు!”

“అబ్బ! మీరు ఆగండి! దేశంకాని దేశంలో ఉన్నది బిడ్డ. ఆ దిక్కుమాలిన చద్ది వస్తువులు, రొట్టెముక్కలు తిని నోరు చవిచెడి ఉంటుంది. అందుకని అడిగిందిలే. మన పిల్లకు మనం గాక ఇంకెవరు చేస్తారు?” అని భర్తమీద ఒంటికాలి మీద లేచి... “మీ నాన్న అలాగే అంటారు లేవే... నీకేం కావాలో అన్ని చెప్పు!” అన్నది పరిణయతో.

“అమ్మా...సంవత్సరమంతా తినాలి కదా! కాస్త చూసి పంపు. పార్సిలు ఖర్చులు నేను పంపుతాలేమ్మా... నాన్నను దిగులుపడవద్దను!” అన్నది పరిణయ.

“ఊరుకోవే... మీ నాన్న ఏమన్నా ‘సింగరాజు లింగరాజు’ అంత లోభి అనుకున్నావా?... ఏదో మాట అంటుంటాడు తప్ప... సరే లేవే మనవరాలి విశేషాలు ఏమిటి? నృత్య గానాదులు సవ్యంగా సాగుతున్నాయా?” అడిగింది పల్లవి.

“వెళుతున్నదిలేవే...ఏడుస్తూ ఏరువాక సాగిస్తూనే ఉన్నది. అయినా నీ పిచ్చిగానీ, ఈ గానాబజానాలు కూడు పెడతాయటే అమ్మా... పిల్లల ప్రాణాలను పీక్కుతినడం తప్ప!”



"తల్లులే ఇలా తగలడితే పిల్లలను అనడ మెందుకు? మా అన్నయ్య మనవరాలు చూడు నాట్యంలో ఫస్టు, సంగీతంలో బెస్టు!"

"ఈ అడ్డమైన పోటీతత్వమే వరస్టు... ఇక ఆపవే అమ్మా! నా కూతురు సంగతి నేను చూసుకుంటానుగానీ, నీ కూతురు అడిగిన పచ్చళ్ళు దండిగా చేసి పంపు!"

"అంతే లేవే నేను పచ్చళ్ళు పెట్టను తప్ప..."

"అదికాదే...ఈ వయసులో కూడ నీకు ఈ మనవరాలి జంఝూటం ఎందుకని అంతే! అయినా కన్నతల్లివి... నీకంటే నా మంచి కోరే వారు ఎవరు చెప్పు. ఇదిగో పచ్చళ్ళకు ఏమేం కావాలో అన్నీ ఒకేసారి తెప్పించుకో. నాన్నను మాటిమాటికి తిప్పి ఇబ్బందిపెట్టకు. ఎండలు మండిపోతున్నాయి!"


"ఇప్పటిదాక మీ నాన్న పిసినారి అని దెప్పి తివి కదే?... అంతలోనే ఇంత ప్రేమ పొంగిం దేమిటి?"

"అది అదే... ఇది ఇదే... నువ్వు కూడ ఎక్కువ శ్రమ తీసుకోకుండా నిదానంగా పెట్టి పంపు. ఈసారి ఎవరికి బట్టలు పంపే పని పెట్టుకోకు. వోన్లీ పికిల్స్... సరేనా?"

"సరే లేవే!" అని ఫోను పెట్టేసింది పల్లవి.

"చూశావా! అమెరికాలో ఉన్నా, ఆంధ్రలో ఉన్నా మనల్ని ప్రశాంతంగా ఉండనివ్వరు కదా పిల్లలు!" విసుక్కున్నాడు పృథ్వి.

"పోన్లెండి...సంవత్సరానికి ఒకసారే కదా. పిల్లలకు ఏదో ఒకటి చేసి పెట్టాలనే ఉంటుంది తల్లికి. అదే తల్లి ప్రేమ!" అంది పల్లవి.




"తల్లిది ప్రేమ...పిల్లలది పీడన. మధ్యన మద్దెల మోతలు అయ్యలకే! ఏమేం కావాలో చెప్పి తగలడు. తెచ్చి పడేస్తాను!" డెబ్భై సంవత్సరాల వయసులో ఎండకు తిరగలేక తను పడుతున్న బాధను, ఇలా మాటల రూపంలో బయట పెడుతున్నాడు పృథ్వి.

✦✦✦

"పరిణా! పార్శిల్ ఇంకా రాలేదేమిటి... నెంబరు ట్రాక్ చేస్తే 'అవుట్ ఫర్ డెలివరి' అని వస్తున్నది?" అడిగాడు పరిణయ భర్త పాంచజన్య.

"నేను కూడ దానికోసమే చూస్తున్నా... చవిచెడ్డ నోటికి కాస్తంత ఆవరుచులు దట్టిద్దామని!" అంటుండగానే ఫోను మ్రోగింది.

"హలో...ఎవరు?"

"ఫ్రం పార్సిల్ ఆఫీస్... మీ పేరుతో పచ్చళ్ళ పార్సిల్ వచ్చింది. యాభై కేజిల బరువు. మీరు దానికి దిగుమతి సుంకం కట్టాలి. కేజికి ఇరవై డాలర్లు. మొత్తం వెయ్యి డాలర్లు! డెలివరి బాయికి చెల్లించి పార్సిల్ తీసుకోండి!" ఆంగ్లంలో చెప్పిందొక అతివ.

"దిగుమతి సుంకమేమిటి? మేమెప్పుడు కట్టలేదు!" ఆమె భాషలోనే అడిగింది పరిణయ.

"సారీ మేడమ్! పోయిన వారమే ట్రంపు గారు ఆర్డరు రిలీజ్ చేశారు. 'ట్రంప్ పికెల్ ఛార్జెస్' పేరిట ఈ ఆర్డరు వెలువడింది. ఇక నుంచి విదేశాల నుంచి దిగుమతి అయ్యే పచ్చళ్ళ మీద సుంకం తప్పదు. ఇప్పుడు ఇరవై డాలర్లే... రేపు అది మరింత పెరగవచ్చు... 'మేడ్ ఇన్ అమెరికా' పచ్చళ్ళ అభివృద్ధి కోసం ట్రంపుగారు తీసుకున్న నిర్ణయం ఇది!" అని ఆంగ్లంలో చెప్పి పెట్టేసింది పార్సిల్ పడతి.


'కాణి దానికి అణా ఖర్చు' అంటే ఇదేనేమో అనుకున్నది పరిణయ.

"ఏమయింది పరిణా?!"

"పికిల్స్ దిగుమతి సుంకంగా మనం వెయ్యి డాలర్లు కట్టాలట. ట్రంపు మన బ్రతుకులను కంపు చేస్తున్నాడు" భోరుమన్నది పరిణయ.

"ఇక ఈ పార్సిళ్ళగోల ఆపు. రేపు ఎవరైతే ఎక్కువసార్లు ఇండియా నుంచి పార్సిళ్ళు తెప్పించుకున్నారో, వారి వీసాలు రద్దు అన్నాడంటే మన కొంప కొల్లేరవుతుంది" అని పాంచజన్య అనడంతో,

"ఆ౦..." అంటూ అక్కడే కూలబడింది పరిణయ. మరి ట్రంపుగారా..మజాకా!





ముళ్ళపూడి వెంకటరమణ హాస్య కథల పోటీలో

బహుమతి పొందిన కథ

# సీక్రెట్ ఏజెంట్స్



పి.వి.రామశర్మ,
9490244344

**"అబ్బబ్బ! దిక్కుమాలిన ఉద్యోగం! ఎంత చేసినా తరగని గాడిద చాకిరీ. ప్రతీ పనికీ నేనే దొరుకుతాను మా బాస్ గాడికి. రిజైన్ ఇచ్చేద్దామన్నంత తిక్కగా ఉంది. రిజైన్ చేస్తే... ముమ్మందు ఎలా బ్రతికి చావాలి? ఈ దరిద్రపు ఉద్యోగం తప్ప ఇంకే పనీ చాతకాదాయే! ఛీ ఛీ!!" అంటూ ఓ రోజు, ఇంట్లోకి వస్తూనే ఏకబిగిని తనని తాను తిట్టుకుంటూ, సోఫాలో కూలబడ్డాడు వెంకి అని పిలవబడే వెంకటకిష్టప్ప.**

**అప్పటికి టైమ్ తొమ్మిదిన్నర కావస్తోంది. పిల్లలు, నిద్రావస్థలో ఉన్నవాళ్ళు, కాస్తా తండ్రి అరుపుల్లాంటి మాటలకి ఉలిక్కిపడి లేచారు.**

"అమ్మా! నాన్నగారికేమైందే? మాలాగే హోం వర్క్ చేయలేదని వాళ్ళాఫీసులోకూడా తిట్టి... ఎండలో నిలబెట్టారా?" అనడిగింది కూతురు.

"ఉష్! మాట్లాడకుండా పడుకో! అసలే నాన్నగారు చిరాగ్గా ఉన్నారు. నీ మాటలు వింటే నీ పని పడతారు!" అని కూతుర్ని కసిరి, మంచినీళ్లు పట్టుకొచ్చి భర్తకి ఇచ్చింది శాంత, శాంతంగా.


తర్వాత... "కాఫీ ఇవ్వనా?"అని అడిగింది, ఆయన స్వగతపు తిట్లతో నాకేం సంబంధం లేదన్నట్టు.

ఓరకంట భార్య మొహంలోకి చూస్తూ... ఆ మొహం 'ఏ భావాలూ పలకని కొత్త హీరోయిన్ మొహం' లా ఉండడంతో... "పోన్లే! శాంత శాంతంగానే ఉంది!" అనుకుని...

"ఊ! కొంచెంఇవ్వు! త్వరగా స్నానం చేసి వచ్చి భోజనంచేసేస్తా." అన్నాడు.

పాపం శాంత, "ఆఫీసులో ఎంత పని ఒత్తిడి లేకపోతే ఇంత మధనపడతారు?" అనుకుని సమాధాన పడింది.

అది మొదలు రోజూ వెంకటకిష్టప్ప ఇదే సీన్ రిపీట్ చేస్తున్నాడు... ఓరోజు అలసటగా సోఫాలో వాలిపోతూ... ఇంకో రోజు తలనొప్పని కణతలురుద్దుకుంటూ... చూసి చూసి... ఓ రోజు శాంత ఎందుకింత లేటవుతోంది అనడగడంతో...



"ఆఫీసులో పని వత్తిడి! బాస్ మారాడు. చంపుకుతింటున్నాడు!" అని చెప్పి...

ఆపై ధైర్యంగా రోజూ ఇంటికి ఆలస్యంగా వస్తూ... వస్తూనే... అదిగో...అలా స్వగత సణుగుళ్ళు మొదలెట్టాడు.

భార్య ఏమీ అనకముందే మనల్ని మనమే ముందుగా తిట్టేసుకుంటే, ఆపై యుద్ధాలు జర గవని అతని నమ్మకం.

అది బాగానే పనిచేసింది! పంటి నొప్పికి సెన్సోడైన్ టూత్ పేస్ట్ లా, నడుంపట్టుకి వొలినీ స్ప్రే లాగా.

కొన్నాళ్లుగడిచాక...


ఆ రోజూ అలానే సణుగుడుమొదలెట్టాడు.

అంతా శాంతంగా విన్న శాంత, ఎప్పట్లానే కాఫీ ఇస్తూ...

"అదేంటోనండీ!... మీ కొలీగ్స్ నర్సింహం, కోదండరాం, రమణమూర్తిగార్లు కూడా ఇంట్లో ఇలానే సణుగుతున్నార్ట! మీ అందరికీ గొప్ప కష్టం ఒక్కసారే వచ్చిపడిందండీ పాపం! పైగా... మీకింత వర్క్ అప్పచెప్పి, మీ బాస్ మాత్రం ఆరింటికే ఇంటికెళ్లిపోతున్నాట్టగా!" అనడిగింది శాంత మెల్లిగా, ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్లా!

అయినా, భార్య డైనమెట్ పేల్చినట్టనిపించి తుళ్లిపడి... "అదేంటి? నీకెలా తెలుసు ఈ విషయాలు!?" అనడిగాడు అయోమయంగా.

"రేపు మీ కొలీగ్స్‌ని అడిగిచూడండి. వాళ్ళు చెప్పలేకపోతే.. నేను చెప్తా!" అంది శాంత...




మొహంలో ఏ భావం లేకుండా.

"అబ్బ! నీలా బ్లాంక్ ఫేస్ పెట్టేవారెవరూ సినిరంగంలోనే లేరే. నీకీవిషయంలో ఆస్కార్ అవార్డ్ ఇవ్వాల్సిందే. కానీ, ఎలాంటి ఆస్కారం లేదే" అనుకుని గప్ చుప్‌గా ఊరుకున్నాడు, వెంకి.

మర్నాడు ఆఫీస్ కెళ్తూనే, అర్జెంట్‌గా ఈ విషయం స్నేహితులతో చర్చించాడు.

వాళ్ళూ, వాళ్ళ ఇంట్లో ఇదే సీన్ జరిగినట్టు చెప్పారు.

ఎందువల్ల వాళ్ళ భార్యలు అలా అడిగారు అన్నది వాళ్ళూ చెప్పలేదుట.


ఆ రోజు రాత్రి ఇంటికొస్తూనే, భార్యని అడిగాడు వెంకీ...

"మావాళ్ళనీ వాళ్ళ ఆవిడలు ఇలానే అడిగార్ట. ఏ మలయాళం సిన్మానో చూస్తున్నట్టు, మాకేం అర్థం కావట్లే. సస్పెన్స్ మాని, అసలు విషయం చెప్పు!" అని.

"సింపుల్! మన పనిమనిషి రాజ్యం వాళ్ళ అక్కరత్నం మీ ఫ్రెండ్స్ ఇళ్ళల్లో కూడా గత వారం అనుకోకుండా పన్లో కుదిరిందిట. ఆ రత్నం మొగుడు సింహాచలం... మీ ఆఫీస్లోనే అటెండర్‌ట. ఈ పనిమనుషులందరికీ ఓ వాట్సాప్ గ్రూప్ ఉందిలెండి. అందులో ఇది వైరల్ అయింది. ఇకపై వాళ్లే మా సీక్రెట్ ఏజెంట్స్... జాగ్రత్త! ఇంతకీ ఆ వైరల్ ఏమిటంటే.. మీరంతా ఆఫీసులో అంతకష్టపడి చేస్తున్నపని చతుర్ముఖ పారాయణమట కదా!" అంది శాంత... నడుం చుట్టూ చీరకొంగు బిగిస్తూ, 'వెంకీ ఇంక నీ టెంకి పగుల్తుంది!' అన్నట్టు బాహుబలిలో దేవసేనలా చూస్తూ.

బ్లాంక్ ఫేస్ అనుకున్న భార్య మొహంలో ఆ భావాన్ని చూసి బిక్కచచ్చి...

"ఇన్నాళ్లుగా ఆడుతున్నా... పోలీసులకే దొరక లేదు... మీకిలా దొరికిపోయామేమిటే!" అనుకుంటూ దొంగచూపులు చూశాడు... వెంకటకిష్టప్ప ఉరఫ్ వెంకీ.








ముళ్ళపూడి వెంకటరమణ హాస్య కథల పోటీలో

బహుమతి పొందిన కథ

# బస్ జర్నీ




లేపాక్షి
9494418940

**గంటనుంచి దిల్‌షుక్‌నగర్ బస్టాప్‌లో బస్సుకోసం ఎదురుచూస్తున్నాడు చిన్నారావు. డైరెక్ట్‌గా లింగంపల్లివెళ్ళే బస్సు ఎక్కితే చార్జీలు కలిసొస్తాయని చిన్నారావు ఆలోచన. రెండుబస్సులు మారితే తొందరగా వెళ్లొచ్చుగానీ ఇరవైరూపాయలు ఎక్కువవుతాయి... ఇంతలో బస్సురానే వచ్చింది.**

బాబోయ్ రెండుబస్సులకు సరిపోయేంతమంది జనం ఉన్నారు అందులో. చిన్నారావు 'పోవోయ్' అన్నట్టు ఆ బస్సు ఎక్క కుండా వెళ్ళి బెంచిపై కూర్చున్నాడు... తనకు తెలుసు ఆర్టీసీ బస్సులు చాలాసేపు రావు... వచ్చాయంటే వరసగా ఒకదానెనక ఒకటి వస్తాయని. అతని ఊహ ప్రకారమే మరో బస్సురానే వచ్చింది. అందులో కూడా జనాలు బస్సులో కూరేసినట్టున్నారు. మూడోబస్సు తప్పక వస్తుందని మళ్ళీ వెళ్ళి బెంచీపై కూర్చున్నాడు... అతని అంచనా తప్పింది. మళ్లీ ముప్పావు గంటగ్గానీ బస్సురాలేదు... ఆ వచ్చిన బస్సులో కూడా నిండుగా ఉన్నారు ప్రయాణికులు. ఏమైందివ్వాళ ఈ ఆర్టీసీబస్సులకు... బస్సులు తగ్గించేశారా ఏంటి? అనుకుంటూ టైమ్ చూసుకున్నాడు.

'బాబోయ్ పదయిందా... పదిదాటితే ఇక బస్సులు తగ్గిపోతాయి' అనుకుంటూ కదులుతున్న బస్సులోకి పరిగెత్తుకుంటూ వెళ్ళి ఎక్కేశాడు... వేసవికాలం క్రిక్కిరిసిన జనం... ఒకవైపు చమట కంపు, మరోవైపు కాలుపెట్టడానికే వీల్లేని విధంగా జనం.

ఇంతలో లకడీకాపూల్ వచ్చింది... చాలామంది గబగబా దిగేశారు. కానీ చిన్నారావుకు మాత్రం సీటు దొరకలేదు. కాళ్ళు లాగుతున్నాయి. 'ఎవడైనా లేచి సీటిస్తే బాగుండు... నేను పండు ముసలాడ్నయినా బాగుణ్ణు ఎవడో ఒకడు లేసి సీటిచ్చేవాడు'. మెల్లగా ముందుకెళ్ళి ఒక రాడ్డును ఆనుకుని నిలబడ్డాడు. నించోవడానికి ఆ రాడ్డే ఎంతో రిలీఫ్ అనిపించింది. ఇంతలో అమీర్‌పేట వచ్చింది. అంతే! జనాలు బస్సులో బంగారు దొరుకుతున్నట్టు ఒకర్నొకరు తోసుకుంటూ ఎక్కేశారు... 'హు.. ఇకనాకు సీటుదొరికినట్టే..' అనుకున్నాడు. లింగంపల్లి వచ్చేంత దూరముంది. ఇంతలో సీట్లో కూర్చున్నతను 'అమీర్‌పేట ఎంత దూరముందన్నా'అని అడిగాడు చిన్నారావును.



వెంటనే చిన్నారావు సీటుకు దగ్గరగా జరిగి "వార్నీ ఇదే అమీర్‌పేట వెంటనే దిగిపో... లెయ్ లెయ్!" అన్నాడు ఆ సీట్లో కూర్చోవడానికి రెడీ అవుతూ.

"అబ్బే! నేను లింగంపల్లి వెళ్లాలి. ఊరికే అమీర్‌పేట ఎలా ఉంటుందో చూద్దామని" అన్నాడు కిటికీలోంచి బయటికి చూస్తూ.

"అమీర్‌పేట్ ఎలా ఉంటుందో


చూట్టమేంట్రా నీ బొంద! ఇదేమైనా టూరిస్ట్ ప్లేసా'అని కసిగా తిట్టుకున్నాడు చిన్నారావు.

యస్సార్‌నగర్‌లో అయినా ఎవరైనా దిగితే బాగుండు అనుకుంటూ చుట్టూ చూశాడు... ముందుసీట్లో ఉన్న ఒకతను కదిలాడు కిటికీ లోంచి చూస్తూ...అతను పైకి లేచాడు! అంతే చిన్నారావు ఒక్కుదుటున వెనకనుంచి ముందు సీటుదగ్గరకెళ్ళి నిలబడ్డాడు. కానీ అతను లేచి జేబులోంచి దువ్వెన తీసి దువ్వుకుని కర్చీఫ్ తీసి ముఖంపైని చర్మం ఊడేట్టు తుడుచుకుని మళ్ళీ కూర్చుని సెల్లు చూడ్డంలో మునిగి పోయాడు. ఇంతలో అప్పటివరకు చిన్నారావు గంటనుంచి నిలబడ్డ వెనక సీట్లోని అతను లేచి వెళ్ళిపోవడం అక్కడే నిలబడి ఉన్న ఒక తను ధబీమని కూర్చోవడం క్షణాల్లో జరిగి పోయింది. 'ధూ నాబతుకు.. ఇంకాసేపు అక్కడే ఉంటే సీటు దొరికేది.. అనవసరంగా ముందుకొచ్చాను' అనుకున్నాడు కారిపోతున్న కన్నీళ్ళు తుడుచుకుంటూ.

కూకట్ పల్లి వచ్చింది. చిన్నారావుకు లోపలి వైపు సీటు దొరికింది! బ్రతుకుజీవుడా అను కుని కూలబడ్డాడు. పక్కనున్నతణ్ణి చూశాడు. హాయిగా కిటికీ పక్కసీట్లో దర్జాగా చల్లగాలిని ఎంజాయ్ చేస్తూ కూర్చునున్నాడు... వాడ్ని చూస్తే అసూయ వేసింది.

"మీరు ఎక్కడికెళ్లాలి" అడిగాడు.

"లింగంపల్లి" అన్నాడు. కోపంగా అతడ్ని కిటికీవైపు తోశాడు జరుగుతున్నట్టు ...




వాడు కోపంగా చూశాడుగానీ ఏమనలేదు చిన్నారావుని. కావాలనే మళ్ళీ తోశాడు. తనకు కిటికీవైపు సీటురాలేదని వొళ్ళు మండుతోంద తనికి.

కూకట్‌పల్లి హౌసింగ్‌బోర్డ్ కాలనీ వచ్చింది.

ముందున్న రెండు సీట్లు ఖాళీ అయ్యాయి.

వెంటనే అందర్నీ పక్కకు నెట్టుకుంటూ వెళ్లి విండో సీట్లో కూర్చున్నాడు. 'వావ్ సూపర్.. విండోలోంచి చల్లగాలి వీస్తోంది.. విండోకూడా విశాలంగా ఉంది. ఈ గాలి ఎంత హాయిగా ఉంది... స్వచ్ఛమైన గాలి' అని తన్మయత్వంలో ఉండగా ఎవరో భుజంమీద తట్టినట్టయి పైకి చూశాడు.

ఇద్దరు ఆడాళ్లు! 'ఏంటి?' అన్నట్టు చూశాడు.

వాళ్ళు పైనున్న బోర్డు చూపెట్టారు. 'లేడీస్' అని రాసుంది. చిన్నారావుకు దుఃఖం పొంగు కొచ్చింది.. సీటు ఖాళీచేసి తను లేచొచ్చిన సీటువైపు చూశాడు. ఎవడో దాన్ని ఆక్రమించు కుని ఫోన్ చూసుకుంటూ కూర్చోనున్నాడు.

మియాపూర్ వచ్చింది... అంతే! పెళ్ళి జనా లేమో బస్సు నిండిపోయేంతమంది ఎక్కేశారు. చిన్నారావుకు మళ్ళీ కన్నీళ్ళ ఉబికాయి... తనంత దురదృష్టవంతుడు ఈ భూప్రపంచం లో ఎక్కడా ఉండదనిపించింది. ప్రయాణికులు తనను చంపేయడానికే బస్సెక్కినట్టు నిమ్మ కాయను పిండినట్టు నలిపేస్తున్నారు.

ఇంతలో మరో స్టేజి వచ్చింది. అంతే అందరూ బిలబిలమంటూ దిగిపోసాగారు.


చిన్నారావు ఒక్కుదుటున పరిగెత్తుకెళ్ళి లేడీస్ సీట్ కాని ఒక మాంచి విండో సీటు ఆక్రమించుకుని 'హమ్మయ్య' అనుకుంటూ సెల్లు తీశాడు...

కండక్టర్ చిన్నారావు భుజం తట్టి 'ఎక్కడి కెళ్ళాలి?' అని అడిగాడు.

"లింగంపల్లి" జవాబిచ్చాడు చిన్నారావు దర్జాగా.

"ఇదే లింగంపల్లి! లాస్ట్ స్టేజ్ దిగు!" అంటూ వెళ్లిపోయాడు కండక్టర్.

డ్రైవర్‌దగ్గరకెళ్లి 'అన్నా! నువు బస్సు రెండొందల కిలోమిటర్ల స్పీడుతో డ్రైవ్ చెయ్యి! నేను రన్నింగ్ బస్సులోంచి దూకి చస్తా!' అని చెప్పాలనిపించింది చిన్నారావుకు.



ముళ్ళపూడి వెంకటరమణ హాస్య కథల పోటీలో



బహుమతి పొందిన కథ

# మంగతాయారూ మహిమాన్వితమూ...



వాడపల్లి
పూర్ణ కామేశ్వరి,
8056024790

**"గృహప్రవేశానికి నాలుగు నిముషాల సమయమే ఉంది... ఇంకా తెంవలకపోతే ఎప్పటికి చేరకునేదీ?" 'స్టార్టు' చేయమన్న ఆదేశాలకోసం స్కూటరు దగ్గర కాలుకాలిన పిల్లిలా తిరుగుతూ అన్నాడు సుందరం.**

**"ఇదిగో వచ్చే... వచ్చే... ఈ అరనిముషంతో వర్జ్యం దాటిపోతుంది. హమ్మయ్య! ఇప్పుడు స్టార్ట్ చెయ్యండి!" అందరికీ పంచిపెట్టాల్సిన విజిటింగ్ కార్డుల సంచీతో వచ్చి కూర్చుంది మంగతాయారు.**

✦✦✦

మేళతాళాలతో అప్పుడే మూడో గుమ్మంలో కొబ్బరికాయ కొడుతున్నారు మంగ చెల్లెలూ, మరిదిగారూ.

"అదేంటండీ! మంగగారూ, అలా ఎత్తెత్తి అడుగులేస్తున్నారు?" వింతగా ఇంట్లోకి ప్రవేశిస్తున్న మంగను అడిగింది మేనత్త.


"ఏం చెప్పమన్నావత్తయ్యా? నెత్తీ నోరూ కొట్టుకుని చెపుతూనే ఉన్నాను గంగకి. నా మాట పెడచెవిని పెట్టింది. ఇప్పుడు చూడు నష్టాలూ, అరిష్టాలలోకి పడబోతోంది!"

"శుభకార్యం జరుగుతున్న ఇంట్లో అవేం మాటలూ?" బుగ్గనొక్కుకుంటూ అంది మేనత్త.

"వాస్తుశాస్త్రం చెపుతుంటే నేనేం చెయ్యను అత్తయ్యా! ఇదిగో చూడు, సింహద్వారం ముందు మూడు మెట్లు ససేమిరా కూడదు... అరిష్టం కాకపోతే ఇంకేమైనా ఉందా! నువ్వే లెక్కపెట్టి చూడు. ఒకటీ, లాభం, నష్టం!! నష్టంతో ఇంట్లోకి ప్రవేశిస్తున్నాం. అలా కష్టనష్టాల్లో పడకూడదంటే రెండే మెట్లుండాలి... అదీ కాక గంగ జాతకం ప్రకారం దానికి అష్టమంలోకి శని ప్రవేశిస్తున్నాడు. మా మరిదిగారికి అర్ధాష్టమం జరుగుతూనే ఉంది!!"

"పోనీ ఒకటి లెక్కపెట్టడం మానేసి లాభం, నష్టం... మళ్ళీ లాభం అని లెక్కేట్టుకుంటేనో!" ఆశగా అన్నాడు గంగపతి.


"చాల్లెండి! వాస్తు, జ్యోతిషశాస్త్రాలను ఆన్లైన్లో అవుపోసన పట్టి పట్టా పుచ్చుకుంది అక్కయ్య. అక్కయ్య అన్న మాటను తూచా తప్పక పాటించాల్సిందే... ఆ మెట్టును కొట్టెయ్యాల్సిందే!" హై కమాండ్ గంగ ఆర్డరు వేసింది.



"శుభమాని గృహప్రవేశం చేసుకుంటూ కొట్టెయ్య డాలూ, విరిచెయ్యడాలూ ఏంటే!" మనసులోని మాటను బయటపెట్టలేక మింగే సాడు గంగపతి.

జరుగుతున్న సత్యన్నారాయణ వ్రతాన్ని పక్కకుపెట్టి రెండో గదిలోకి చేరారు అమ్మ లక్కలు... కోరికల చిట్టాతో జాతక పట్టీని చూపించ కోవడానికి వరుసలో కూర్చు న్నారు. ఒకొక్కరికీ రానున్న జీవితాన్ని సినిమాగా చూపినంత పని చేస్తోంది మంగతాయారు.

"ఈ ఏడు, మన మంగగారికి పద్మశ్రీ పుర స్కారాన్ని వ్వాల్సిందే" పొగడ్తలతో ముంచేస్తున్న పంకజం, పట్టుచీర సద్దుకుంటూ అంది.




"ఇప్పటికే ఎన్నో వాస్తు సవరింపులే కాక, ఎందిరికో జాతక పరహారాలు చెప్పినందుకు పద్మశ్రీ ఏం ఖర్మ పద్మభూషణే ఇవ్వవచ్చు!" దివ్యమైన జాతకమని మంగ తేల్చి చెప్పిన మరో తరుణీమణి ఆనందంతో ఉబ్బితబ్బిబ్బ వుతూ అంది.

"నా జాతకరత్న బిరుదు ఇవాళ సార్థకమ య్యింది. వాస్తు, జ్యోతిష సలహాలు అందు కున్నవారందరూ, మీ సలహాలు మాకు మహి మాన్వితాలు మంగగారూ అని అంటుంటే కలి గిన తృప్తే వేరు!" అలసి ఇంటికి చేరినా, పొగడ్తల పరవశంలో మురిసింది మంగ.


"మీకిప్పట్నుండీ రాజయోగమన్నావుగా మంగా... ఇదిగో ప్రత్యక్షంగా కనిపిస్తోంది!" చేతిలోంచి వార్తా పత్రికను జారవిడుస్తూ... అన్నాడు సుందరం.

"నా మాటకు తిరుగులేదు... మీకు రాజ యోగం తథ్యం! అంతెందుకు, మన సింగా రానికి కూడా చెప్పాను గుర్తుందా! అప్పు చేసి మరీ వడ్డాణం కొనింది. ఇప్పుడు దాని వెల రెట్టింపైయ్యింది, చూసారూ... అంతే కాదు ఆ పంగనామాల ఫైనాన్సు కంపెనీ దానిపై అసలూ, వడ్డీ కలిపి ఇచ్చారు!...

అది సరేగానీ, నాకు పద్మశ్రీ వచ్చినట్టు కలొచ్చిందండోయ్... తెల్లవారుఝామున వచ్చే కలలు నిజమవుతాయంటారు తెలుసా!..." గర్వానికి సిగ్గునద్ది మెలి కలు తిరుగుతూ అంది మంగతాయారు.

"పదవీ విరమణానంతరం వచ్చిన పింఛను డబ్బునంతా పెట్టిన పంగనామాలు ఫైనాన్స్ కంపెనీ జెండా ఎత్తేసిందే!!" బిక్కచచ్చిపోయి అన్నాడు సుందరం.

చావుకబురు చెప్పడానికి కూడా ఆపై నోరు పెగల లేదు సుందరానికి. ఊహాలోకంలో విహరిస్తూ పద్మశ్రీ స్వీకారంకోసం ఢిల్లీకి చేరు కున్న మంగకు పతిదేవుని మాటలు వినిపించ ట్లేదు, కుప్పకూల్చిన ప్రహరీ గోడను దాటుకుని వస్తున్న సింగారం చేతిలోని చీపురుకట్టా కని పించలేదు.





ముళ్ళపూడి వెంకటరమణ హాస్య కథల పోటీలో

బహుమతి పొందిన కథ

# విష్ణుమాయ




మోచర్ల
అనంత పద్మనాభరావు,
9848607127

"గృహప్రవేశం రోజునే చెప్పాను... గృహ శాంతికోసం వాస్తుపూజ ఎలాగూ చెయ్యాలి, అలాగే గృహిణి మనశ్శాంతి కోసం పనిమనిషి వాస్తు పూజ లాంటిదేదైనా ఉంటే అది కూడా కాస్త జరిపించి పుణ్యం కట్టుకోవయ్యా బాబూ! అని... నా మాట నువ్వెప్పుడు విన్నావు కనుక? ఇప్పటికి మూడు రోజులైంది పనిమనిషి మానేసి. నా చావు నే చస్తున్నా! కాని, నీకు మాత్రం చీమ కుట్టినట్టైనా లేదు!" గయ్యిమంది మహాలక్ష్మి.

సింకు నిండా ఉన్న గిన్నెల్ని చూసి 'నేనున్నానుగా' అని అభయమిచ్చినట్టు చెయ్యెత్తి ఓ వెర్రినవ్వు నవ్వేడు విష్ణుమూర్తి.

"నవ్వకు! మండిపోతోంది... పాతింట్లో పనిమనిషులు సరిగ్గా రాక చాలా ఇబ్బందయ్యింది... కొత్తింట్లోనైనా నా తలరాత మారుతుందేమోననుకున్నా... పనిమనిషి సరిగ్గా రాకపోయినా, వచ్చినరోజు మాత్రం అదే మహాభాగ్యమన్నట్టు దాన్నెంత మురిపెంగా చూసుకునేదాన్ని. అది రానప్పుడు నిన్ను తిట్టాను గాని, దాన్ని పల్లెత్తు మాటనడం ఎప్పుడైనా చూసావా?... ఎందుకనంటే నిన్నెన్ని తిట్టినా చచ్చినట్టు ఇంటికే వస్తావు. కాని అదలా కాదు కదా?... కొంచెం తేడాపాడా వస్తే పనొదిలేసి పక్కింటికి పోతుంది. ఆపైన నా చావు నే చావాల్సిందే...

ఈ బాధంతా ఎందువలనో అప్పుడే నాకర్థమైంది. నీకు మాత్రం కొంచమైన అర్థం కాలేదు. అదే...పనిమనిషిని కూడా అతి ముఖ్యమైన గ్రహంగా భావించి వాస్తు పూజ చేయించమని చెవినిల్లు కట్టుకుని పోరినా నువ్వు పెడ చెవిన పెట్టావు. సో... లక్షణమైన పనిమనిషి దొరికక, దొరికిన పనిమనిషి బిన్నీ గుడ్డలా నాలుగు కాలాలు ఉండక, నెలకొకరు చొప్పున ఈ అయిదేళ్ళల్లో షష్టి పూర్తయ్యింది. అంటే అరవైమంది పనిమనుషులు మారారు." పొద్దున్నే పిల్లలికి ఏదైనా చేసి బాక్సుల్లో పెట్టాలి. తర్వాత తమ కోసం టిఫిన్, వంట చేసి ఆఫీసు కెళ్ళాలి. పని తెమలక సతమతమౌతో విష్ణుమూర్తిపై తన అసహనాన్ని వెళ్ళగాక్కుతోంది మహాలక్ష్మి.



పిల్లలకి యూనిఫార్మ్ వేస్తున్న వాడల్లా ఆ పని ఆపుచేసి ఆమెకేసి మిడిగుడ్లేసుకుని మరీ చూసాడు విష్ణుమూర్తి.

"తప్పంతా నాదేనన్నట్టు అలా చూస్తావేంటి... అంటే పనిమనుషుల పాలిట నేనో బ్రహ్మరాక్షసి ననుకుంటున్నావా?..." తనలో తాను మాట్లాడు కుంటూనే పిల్లల బాక్సులు సర్దుతోంది... అవడానికి అది చిన్న గొణుగుడైనా పొద్దున్నే టీవీలు పెట్టని వాళ్ళం దరికీ ఆలిండియా రేడియో సిగ్నేచర్ ట్యూనులా

వినిపించేలా ఉంది. పనిమనిషి రాకపోకలకు సూచనగా వినబడే ఆ గొణుగుడు అలవాటైన విష్ణుమూర్తి–

"అబ్బెబ్బే! అదేం లేదు. పనిమనిషి ఎందుకు దండగ? ఈ మొగుడుండగా నీ అండగా...!' చిరునవ్వుతో అభయాస్తం చూపిస్తూ పిల్లల లంచ్ బాక్సులను తీసుకుని వాళ్ళని స్కూల్లో దింపడానికి వెళ్ళిపోయాడు.

✦✦✦

కాలింగ్ బెల్ మోగింది.

తలుపు తీసిన మహాలక్ష్మి–

"టైమెంతయ్యింది?"

"పావు తక్కువ ఎనిమిది."

"ఇప్పుడు గిన్నెలు తోమి, బట్టలుతికేసరికి ఎంతవుతుంది?"

"తొమ్మిదకల్లా సేసేస్తానండి. ముందు కాస్త కోపం నేకుండా కాసిన్ని కాపీ సుక్కలు పోయిండమ్మాయిగారు. కాపీ తాగేసి చెనంలో పనంతా చేసేస్తా. ఈలోగా మీరు అయ్యగారికి టిపిని, వంట సేసేసి తయారైపొండి... మరీ అలేసం అవితే బట్టలు రేపుతుకుతానండి ఆయ్!"

"నువ్వెప్పుడు ఇంతే! ఒక పని చేస్తే ఇంకొకటి బాకీ పెడతావు. సరే ఏదోటి తొందరగా చెయ్. ముందు కాఫీ తీసుకో." కప్పుతో కాఫీ అందించింది.

"అమ్మాయిగోరు!... అయ్యగారు కాపీలో ముంచుకు తింటారు ఆయ్.. అయేనండి మేరీ బిస్కత్తులు... ఓ రెండు ఇయ్యిరా!"

"నిన్నూ...." కోపంతో...

"అవతల నాకు టైమవుతోంటే మధ్యలో ఈ గొంతెమ్మ కోరికలేంటో?" విసుక్కుంటూ బిస్కట్లిచ్చింది.

"నేను స్నానానికి వెళ్తున్నాను."

"ఏయ్! నువ్వెక్కడికి...?

"తవరు స్నానం సేస్తుంటే ఈపు తోముదామని! సాలా కాలమయ్యింది కదా అమ్మాయిగోరు."


"ఇప్పుడేం వీపు తోమక్కర్లేదు... నోరు మూసుకుని నీ పని చేసుకో. నాకు ఆఫీసుకు టైమవుతోంది... కుక్కర్ మూడు కూతలు రాంగానే స్టౌ ఆర్పేయ్ మర్చిపోకు. తొందరగా నీ పని ముగించుకో... లేకపోతే నాకాఫీసు లేటవుతుంది."

స్నానం ముగించుకొచ్చిన మహాలక్ష్మిని అదోలా చూస్తూ– "అమ్మాయిగోరు ఈ గులాబి రంగు సీరలో మీరు సానా బావుంతారండి... నాకైతే మిమ్మల్ని ముద్దట్టేసుకోవాలనిపిస్తోంది. నాకే అట్టాగుంటే... మరి అయ్యగారి సంగతేంటో??..." అప్పటివరకు ఆపుకున్న నవ్వు కట్టలు తెంచుకున్న ఏరులా... పొర్లిపొర్లి వస్తుంటే...


"ఇక చాల్లెండి మీ మాయ మాటలు! మాయ చేష్టలు!! ఆ పరకాయప్రవేశాన్ని వదిలేసి మొగుడి రోల్లోకి వచ్చెయ్యండి బాబూ. ఏదో ఒకరోజు... పనిమనిషి రాకపోతే హెల్ప్ చేసినందుకు మరీ ఆ పాత్రలో అంతలా లీనమవ్వక్కర్లేదు... ఇక అదేదో అన్నారే.... అదే ఆ ము...ము! ఆ...అదే! ముందు దాని సంగతి చూడండి." మురిపాలు పోతున్న మహాలక్ష్మిని మోహంతో దరిచేరాడు విష్ణుమూర్తి.

ఆ తర్వాత...

అంతా విష్ణుమాయ ...!!!




కార్టూన్ రంగంలో తమదైన శైలితో చక్కటి బొమ్మలు మరియు క్యాప్షన్‌లతో కార్టూన్‌లు అందిస్తున్న లబ్ధ ప్రతిష్ఠులైన అనేకమంది కార్టూనిస్టులు మన దేశంలో ఎంతోమంది ఉన్నారు. తెలుగులో ఉన్న కార్టూనిస్టులు, వారి వారి ప్రత్యేకతలు మనకు ఇప్పటికే తెలుసు. అలాగే వివిధ భాషల్లో కార్టూన్‌లు వేస్తున్న ఎంతో మంచి కార్టూనిస్టులు ఉన్నారు. అద్భుతంగా కార్టూన్లు వేస్తూ పాఠకులను రంజింప చేస్తున్న ఇతర భాషా కార్టూనిస్టులను మన పాఠకులకి పరిచయం చేస్తున్నారు- ప్రముఖ కార్టూనిస్టు శ్రీ నాగిశెట్టి గారు.



వచ్చే సంచిక నుంచి ప్రారంభం!



ముళ్ళపూడి వెంకటరమణ
హాస్య కథల పోటీలో

బహుమతి పొందిన కథ

# చిట్టి– ఫ్యామిలీ సాంగ్



విశాలి పేరి
6362564577

**"తద్దినం అంటే ఏంటమ్మా?..." అని అడిగింది చిట్టి.**

**"మొన్న మామ్మతో నువ్వు మావతాతగారింటికి వెళ్ళి భోజనం చేసి వచ్చావు చూడు అదే..." అని చెప్పింది చిట్టి తల్లి సుజాత.**

**"అవునా? మరే... పోయినేడాది మామ్మ నన్ను నాలుగుసార్లు ఇలాంటి భోజనాలకి తీసుకెళ్ళింది కదా?... మరి మనింట్లో తద్దినం లేదా?" అని అడిగింది చిట్టి.**

**"ఉంది!... వైశాఖ మాసంలో వస్తుందిలే!" అని అంది సుజాత.**

"ఈ వైశాఖం, వైజాగు కాదు ఎప్పుడో కరక్ట్‌గా చెప్పు!" అంది చిట్టి.

"అబ్బా! మే నెలలో వస్తుంది లేవే..." అని కాస్త విసుగ్గా అంది సుజాత.

"వాళ్ళింట్లో అన్ని తద్ధినాలుంటే మన ఇంట్లో ఒకటే ఎందుకుంది?" మళ్ళీ అడిగింది చిట్టి.

"ఎవరేనా దేవుడి దగ్గరకు వెళ్ళిపోతే వాళ్ళు వెళ్ళినరోజునాడు ఇదిగో ఇలా తద్దినాలు పెడ తారు!" అని వివరంగా చెప్పింది సుజాత.

"పుట్టినరోజులా ఇది చచ్చినరోజా?" అని అంది చిట్టి.

జడ వేస్తొన్న సుజాత చిట్టి నెత్తి మీద మొట్టికాయ కొట్టి –"తప్పు! అలా అనకూడదు!"అంది.

"మరీ..." అని మరేదో ప్రశ్న వేస్తుంటే చిట్టితో– "ఇదిగో! ఈ పళ్ళెం తీసుకొని వెళ్ళి మల్లె పూలు కోయడంలో వాణక్కకు సాయం చెయ్యి!" అని పురమాయించింది సుజాత.

✦✦✦

చిట్టి అసలు పేరు మీనాక్షి. తొమిదెళ్ళ పిల్ల. ఇంట్లో ముద్దుగా చిట్టి అని పిలుస్తారు... బయటవాళ్ళు, మరి కొంతమంది దాని విషయం తెలిసినవాళ్ళు మాత్రం 'సిసింద్రి చిట్టి' అని పిలుస్తారు. మే నెల వేసవి సెలవలకని తాతగారి ఇంటికి వచ్చింది చిట్టి అమ్మ, నాన్నతో!



✦✦✦

ఒకరోజు పిల్లలందరినీ తీసుకొని పక్కన ఉన్న అమలాపురంలో సినిమాకి తీసుకొని వెళ్ళి మార్నింగ్ షో, మేటనీ చూపించి అక్కడే ఉన్న హోటల్లో భోజనం పెట్టించి తీసుకొచ్చాడు చిట్టి వాళ్ళ బాబాయ్.

సాయంత్రం అందరూ ఇంటికొచ్చి అలసిపోయి పడుకున్నారు. మరునాడు ఇంట్లో చిట్టివాళ్ళ ముత్తాతగారి తద్దినము. పిల్లలందరికీ పక్కన వాళ్ళ ఇంట్లో చద్దన్నం పెట్టించేశారు. ఇంట్లోకి రావద్దని నిక్కచ్చిగా చెప్పేసారు పెద్దవాళ్ళు. వీధి అరుగు మీద కూర్చొని చింతపిక్కలాట, కాసేపు అష్టాచమ్మా ఆడుకున్నారు.

ఇంతలో– "ఈ సినిమాలో అన్నదమ్ముల లాగా మనం కూడా ఎక్కడైనా తప్పిపోతే ఎలా?" అని చిట్టి అనుమానంగా అడిగింది.

అందరూ చిట్టి వైపు జాలిగా, భయంగా చూశారు.

"అందుకే మనమందరం ఒక ఫామిలీ పాట పెట్టుకోవాలి!" అని ఒక నిర్ణయానికి వచ్చినట్టు చెప్పింది చిట్టి.

"ఎవరికిష్టమైన పాట వాళ్ళు చెప్పండి... అందరికి ఎక్కువ ఇష్టమైన పాటే మన ఫామిలీ పాట అవుతుంది!" అంది వాణి.

"నాకు చిరంజీవి ఇష్టం కాబట్టి... అమ్మడు లెట్స్ దూ కుమ్ముడు పెట్టుకుందాము!" అని పాడాడు చిట్టి కజిన్.

"ఊహూం! దాయి దాయి దామ్మా..." పెట్టుకుందాము అని అంది ఒక చిన్నారి.

"అమ్మనీ తియ్యనీ దెబ్బ!" అని వాణి తమ్ముడు.

"కాపురమొస్తే కాదంటానా... కౌగిలి నీకే లేదంటా..." అని అందుకుంది చిట్టి.

అటుగా వెళ్తున్నా చిట్టి పెదనాన్న కొడుకు, మావయ్య చిట్టిని మోసుకొని లోపలకి తీసు కెళ్ళారు.

"నేనేమన్నానని ఇలా మోసుకొచ్చేసారు?" అని దాబాయించి అడిగింది చిట్టి.

"ఆ పాటలేంటీ?" అని గట్టిగా అడిగాడు చిట్టి మావయ్యా.

"ఏం తప్పేముంది?కాపురం అంటే గిన్నెలు, డబ్బాలు సద్దుకోవడమే కదా? నాకు మామ్మ చెప్పిందిలే. చిన్నత్తకి కాపురానికి పెట్టి వచ్చాను అనంటే..."కాపురం అంటే ఏంటి మామ్మ?" అని అడిగినప్పుడు చెప్పింది... గిన్నెలు, డబ్బాలు సర్దిరావడం అని!" అని పెద్ద ఆరిం దలా కళ్ళు తిప్పుతూ అంది చిట్టి.


"అవునూ, ముత్తాతగారు చచ్చిపోతే ఆయన కాళ్ళ దగ్గర 'ఏవండీ' ముత్తమామ్మ ఎందుకు చచ్చిపోలేదూ?" అని ధర్మసందేశం అడిగింది చిట్టి

చిట్టి వాళ్ళ అమ్మ అక్కడకి వచ్చి–

"ష్! ఆరిందాలా అత్తెలకొత్తెల కబుర్లూ నువ్వూనూ,గోల చెయ్యకు పద ఇక్కడ నుంచి!" అని చిట్టిని తీసుకెళ్ళిపోయింది.

తరవాత భోజనాల దగ్గర గారెలు తింటూ చిట్టి–

"అబ్బా! ఇంతమంది ఇలా వస్తే... ఎంత బాగుందో కదా? రోజూ ఇంట్లో తద్దినం ఉంటే బాగుణ్ణు...చక్కగా గారెలు, పరవాన్నం తినచ్చు




అందరం కలిసి... మేము ఎంత సేపు ఆడు కున్నా మీరు పట్టించుకోరు తిట్టరు కూడా! మామ్మా! నీ నందికేశుడి నోము కన్నా... ఈ వంటలే బాగున్నాయ్!" అంది.

"అయ్యో!... అలా అనకూడదే!" అని చిట్టి వాళ్ళ మామ్మ వారించింది.

మిగిలినవాళ్ళు మాత్రం నవ్వుకున్నారు.

✦✦✦

సాయంత్రం చిట్టి వాళ్ళ తాతగారి దగ్గరకు ఒక షావుకారు వచ్చి–

"మా చిన్నాన్న కొడుకు కనపడటం లేదండి నిన్నటి నుంచి. ఇంట్లో వాళ్ళ నాన్న కోపడ్డాడని ఎటైనా వెళ్ళిపోయాడో ఏమిటో? అసలే కాస్త అమాయకుడు!" అని బాధపడ్డాడు.

అటుగా వచ్చిన చిట్టి– "కనపడకపోతే మీ ఫామిలీ పాట పాడుకుంటూ వెతుక్కోవచ్చు కదా?... మా ఇంట్లో అయితే... ఎంచక్క చిరంజీవి పాట ఫామిలీ పాటగా పెట్టుకుందా మని అనుకున్నాము. మీ బాబాయ్ కొడుకు బాలకృష్ణ ఫాన్ కదా! ఏదైనా మంచి బాలకృష్ణ పాట పాడితే దొరుకుతాడెమో చూసుకోండి!" అని సలహా ఇచ్చింది చిట్టి.

చిట్టి వాళ్ళ తాతగారు నవ్వుకొని–

"ఏ ఊరైనా వెళ్లాడేమో కాస్త బస్‌స్టాండ్‌లో అడిగి చూడండి!" అని సలహ ఇచ్చారు.

షావుకారు అక్కడి నుంచి వెళ్ళాడు.

"ఇది అందరిళ్ళకి తిరుగుతూ వాళ్ళతో కబుర్లు చెప్తుందేమో అందుకే ఆ పారిపోయిన వాడు బాలకృష్ణ ఫాన్ అని తెలుసుకుంది!" అని అన్నారు చిట్టి తాతగారు.

"మరే ఇల్లో నారాయణమ్మా ఇది!" అని నెత్తి మీద చిన్నగా వేశాడు చిట్టి నాన్న.

✦✦✦

మరునాడు ఉదయం పది పదిన్నర మధ్యలో బోలెడు మిఠాయిలతో ముందు రోజు వచ్చిన షావుకారు వచ్చి–

"చిట్టెమ్మ ఉందాండి?" అని అడిగాడు

చిట్టి పెరట్లో ఆడుకుంటోందల్లా వచ్చి...


"మీ బాబాయ్ కొడుకు దొరికాడా?" అని అడిగింది.

చిట్టి కుటుంబ సభ్యులందరూ అక్కడికి వచ్చారు.

"నిన్న బస్‌స్టాండ్‌కి వెళ్ళి వాకబు చేయగా మా బాబాయ్ కొడుకు రాజమండ్రీ వెళ్ళాడని తెలిసింది. రాజమండ్రిలో ఎక్కడ వెతకాలో అని అయోమయంలో పడిపోయాము....

వెంటనే మీ చిట్టి మాటలు గుర్తొచ్చాయి... బాలయ్య సినిమా ఆడే సినిమా థియేటర్ దగ్గరకి వెళ్ళి చూడగా... అక్కడే మా తమ్ముడు కనపడ్డాడండి. చిట్టీ!...నువ్వు నిజంగా సిసింద్రీ చిట్టివే..." అని తను తెచ్చిన పూలు, పళ్ళు, మిఠాయిలు చిట్టికి ఇచ్చి వెళ్ళాడు.

"చూసారా?... ఇలా ఫామిలీ పాట ఒకటి పెట్టుకుందామంటే.. నాకు ప్రైవేట్ చెప్పేశారు నిన్న!" అని అందరివైపు కళ్ళెగరేసి చూసింది సిసింద్రి చిట్టి.



కథ-కథనం

**యండమూరి వీరేంద్రనాథ్**

**యర్రంశెట్టి శాయి**





# కొంగుచాటు కృష్ణుడు



**గతంలో...** మనుషుల్ని సృష్టించడం చాలా సులభమని, భర్తతో సవాలు చేసి సరస్వతి ముగ్గురు మగపిల్లల్ని, ఇద్దరు ఆడపిల్లల్ని సృష్టించింది. సరస్వతి సృష్టించిన మొదటి మనిషి పేరు మల్లెమాల బోసు. స్కూల్లో సైన్స్ టీచరు. సరస్వతి సృష్టించిన రెండో వాడు గూటాలపల్లి ఆనందరావు, అమ్మాయిల కోసం ఎన్ని వేషాలైనా వేయటానికి వెనుదీయక పోవటం అతడి చెడుగుణం. మూడోవాడు సాత్వికరావు, పరమ సాత్వికుడు! సరస్వతి సృష్టించిన రెండో అమ్మాయి రాధ. ఒకరోజు సాత్వికరావు, రాధ రెస్టారెంట్ కెళతారు. అక్కడ రతీమన్మథులు ప్రత్యక్షమవుతారు. **ఆ తర్వాత...**

**గండిపేటలో ఆ రోజు నీటి మట్టం కేవలం అర అడుగు మాత్రమే ఉంది. ఆ కొద్దిపాటి నీళ్ళనూ నగరవాసులకు ఇంకెన్ని రోజులకు సర్దాలో తెలీక వాటర్‌వర్క్స్ డిపార్ట్‌మెంట్ వాళ్ళు ఆ పక్క గట్టుమీదే కూర్చొని తలలు బద్దలు కొట్టుకుంటున్నారు.**

**నీళ్ళలో పడుతూనే నీటి అడుగున ఉన్న నేలను తాకటం వల్ల సాత్విక రావు మోకాలు హూనం అయిపోయింది.**

**అతి కష్టం మీద లేచి నించున్నాడు.**

**"హూఁ! నీళ్ళు లేవన్న విషయం బోర్డు రాసి పెడితే బాగుండేది కదా?" అనుకొని మోకాలి నొప్పి భరించలేక పడుతూ లేస్తూ...**

సెంట్రల్ గవర్నమెంట్ వాళ్ళ 'రోజుకో హిందీ పదం' తాఖీదు ప్రకారం అంతకు ముందురోజు బ్యాంక్ వాళ్ళు నేర్పించిన హిందీ పదం గుర్తు తెచ్చుకొని "బచావ్ బచావ్" అని అరిచాడు.

వాటర్ వర్క్స్ వాళ్ళు పరుగున వచ్చి సాత్వికరావుని కోపంగా బయటకు ఈడ్చుకొచ్చారు.

"జీవితం మీద ఏ ఆశా లేని నన్నెందుకు ఎందుకు బ్రతికించారు?" స్వరంలో శివరంజని పలుకుతూ అన్నాడు సాత్వికరావు.

"నీ మీద ప్రేమ కాదు. ఉన్న కాసిని నీళ్ళూ పాడవకుండా! అసలే జంట నగరాల్లో తాగటానికి నీళ్ళు లేక చస్తుంటే నువ్వు ఇందులోనే దూకి చావాలా?... అంత కోరికగా ఉంటే హుసేన్‌సాగర్‌లో దూకు. మునక్క ముందే పొల్యూషన్ వల్ల చస్తావ్!" కంఠంలో కదన కుతూహలం మ్రోగిస్తూ చెప్పారు.

సాత్వికరావు నీరసంగా మూలుగుతూ నిలబడ్డాడు.

అంతవరకూ ఆ తమాషా అంతా చూస్తోన్న ఓ విద్యార్థి ముందుకొచ్చాడు. వెనుకే అతని గర్ల్‌ఫ్రెండ్ ఉంది.

హాలిడే పిక్నిక్‌కి వచ్చి వెనక్కి తిరిగి వెళ్తున్నారు.

వాడు చెరువులో దిగినట్టున్నాడు.

అమ్మాయి బట్టలు తడిగా ఉన్నాయి.

సాత్వికరావుతో వినయంగా... "నమస్కారం సార్!" అన్నాడు.

"నమస్తే! నువ్వెవరు?" అడిగాడు సాత్వికరావు.

"అదేమిటి సార్! నన్ను గుర్తుపట్టలేదా? నేను వినయ్ కుమార్‌ని. కిందటేడు టెంత్-బి స్టూడెంట్‌ని... ఇప్పుడు ఇంటర్!"

సాత్వికరావుకి అతని మాటలేమీ అర్థం కాలేదు.

"ఇంకా గుర్తు రాలేదా సార్? మాకు టెంత్‌లో సైన్స్ ఎక్స్‌పెరిమెంట్స్ ఏమీ చెప్పకుండా, ల్యాబ్‌లో మీరే ఏవేవో పరిశోధనలు చేసుకుంటూ ఉండేవారు..."

"నేను సైన్స్ టీచర్నా?" సాత్వికరావు అయోమయంగా చూశాడు.

"ఏదో కన్‌ఫ్యూజన్‌లో ఉన్నట్టున్నారు. పదండి. మీ ఇంటి దగ్గర డ్రాప్ చేస్తాను!" అంటూ కారులో ఎక్కించుకున్నాడు.

"నేను రాను!" అందామనుకున్నాడు కానీ అక్కడే ఉన్న వాటర్ వర్క్స్ డిపార్ట్మెంట్ వారు... 'మళ్ళీ ఇటువైపు వస్తే పోలీస్ రిపోర్టు ఇస్తాము' అని బెదిరించటం వల్ల బలవంతంగా కారు ఎక్కాడు.

కుర్రాడు నడపసాగాడు. ముందు సీట్లో వాడి పక్కనే అమ్మాయి కూర్చుంది.

వెనుక సీటు మీద నిస్త్రాణగా వాలి పోతూ...

"మొన్నే పదో క్లాసు అన్నావు. డ్రైవింగ్ వచ్చా?" సాత్విక్ అన్నాడు.

"ఎనిమిదో క్లాసులోనే ఎనిమిది ఆక్సిడెంట్లు చేశాను సార్..." గుట్కా నోట్లో వేసుకుంటూ అన్నాడు వినయ్.

చెరువు దగ్గర తడిపింది చాలదన్నట్టూ ముందు సీటు అమ్మాయి వాడిని సరిగ్గా డ్రయివు చేయ్యనివ్వటం లేదు... వాడు కూడా ఒక్క చేత్తోనే డ్రైవ్ చేస్తున్నాడు. మరీ ఆవేశం వస్తే అప్పుడప్పుడు రెండో చేయి కూడా వదిలేస్తున్నాడు.

సాత్వికరావుకి భయం వెయ్యలేదు.

'ఎలాగో చావబోయేవాడికి ఎలా ఛస్తే ఏముంది! చావు ఇలా రాసి పెట్టి ఉందేమో...' అనుకుంటూ ఒక వేదాంతపరమైన ఊపిరి వదిలి నిస్త్రాణగా కళ్ళు మూసుకున్నాడు.

తిరిగి కళ్ళు తెరిచేసరికి అర్ధరాత్రి దాటింది.

కారు ఓ ఇంటి ముందు ఆగి ఉంది.

"దిగండి! మీ ఇంటికి వచ్చేశాం!" అన్నాడు వినయ్.

ఆ అమ్మాయి దిగలేదు. తన చెరువు గట్టు మీంచి వెనక్కి తొందరగా వచ్చేసినందుకు కోపంగా ఉన్నట్టుంది.

కారు దిగిన సాత్వికరావు ఆ వీధినీ, ఆ ఇంటినీ ఆశ్చర్యంగా చూసి, "ఇది మా ఇల్లు కాదు!" అన్నాడు.

"భలేవారే. మీ ఇల్లు నాకు తెలీదనుకుంటున్నారా ఏమిటి? ఇంతకు ముందు చాలాసార్లు వచ్చాను. పదండి!" అంటూ బలవంతంగా గేటు దగ్గరకు లాక్కెళ్ళాడు.

సరిగ్గా అప్పుడే లలితాదేవి బయటకు వచ్చింది.

ఆమె కళ్ళవెంబడి నీళ్ళు కారుతున్నాయి.

భర్తని చూసి ఆనందంతో– "ఆఁ... వచ్చేశారా? మీరు తిరిగి వస్తే కొబ్బరికాయ కొడతానని ఇప్పుడే దేవుడికి మొక్కుకున్నానండీ!" అంది కన్నీళ్ళు తుడుచుకుంటూ.

సాత్వికరావు ఆమెను చూసి నిశ్చేష్టుడయ్యాడు.

తను ప్రేమించిన రాధే! కానీ తమాషా ఏమిటంటే ఆమె అలంకరణ పూర్తిగా మారిపోయింది. మెడలో ఇప్పుడు మంగళ సూత్రం కూడా ఉంది. ఆరోజు డిసెంబరు నెలాఖరు అవటంతో టపాసులు కాలుస్తున్న కాలనీ జనం అంతా క్షణాల్లో పోగయిపోయారక్కడ.

జరిగింది చెప్పాడు కుర్రాడు.

"ఏమిటయ్యా ఇది?! భార్యతో పోట్లాట వచ్చినప్పుడల్లా అలా రైళ్ళ కిందా, నదుల్లోనూ దూకేస్తూంటే ఎలా?... సంసారం అన్నాక కలత






లొచ్చినా మళ్ళీ వెంటనే ఒకటయిపోవాలి....

మొగుడితో గొడవ వచ్చినప్పుడల్లా... పెళ్ళాము... భార్యతో గొడవ వచ్చినప్పుడల్లా... మొగుడూ ఛస్తూ పోతే, ఆర్నెల్లు అయ్యేసరికి ఈ ప్రపంచంలో మనుషులంటూ ఎవరూ మిగలరు!" అన్నాడో సర్రియలిస్టు.

"అలా బుద్ధి చెప్పండి అన్నయ్యగారూ!... పెళ్ళయిన మొదటి రాత్రి నుండీ ఇదే వరస. ఎప్పుడూ పోట్లాటే. ఎప్పుడూ నన్ను తిట్టి చస్తానని బెదిరించటమే!" అంది లలిత.

సాత్వికరావుకి మతి పోతోంది.

'తొలిరాత్రి సంగతి దేవుడెరుగు... ఇంకా పెళ్ళే లేదు! అప్పుడే మూడు రాత్రులూ అయిపోయినట్టే మాట్లాడుతోందేమిటి?' అనుకున్నాడు.

"రాధగారూ!... మీరేం మాట్లాడుతున్నారో నాకేమీ అర్థం కావటం లేదు! పెళ్ళి చేసుకుందామని అడగబోతేనే చెంప పగలగొట్టారు కదా! మొదటి రాత్రి ఏమిటి?" అన్నాడు.

"చూశారా? చూశారా? నా పేరు రాధంట! మాకింకా పెళ్ళి కూడా కాలేదంట. ఆయనదసలు ఈ ఇల్లే కాదంట. చూస్తారేమండీ? ఆయనక్కొంచెం బుద్ధి చెప్పండి!" అంటూ అందరినీ అర్థించింది లలితాదేవి.

"చూడండి చంద్రబోస్! ఆడకూతురిని ఇలా ఉసురు పెట్టటం మంచిది కాదండీ. రోడ్డు మీద సీను క్లోజ్ చేసి లోపలికెళ్ళండి."

సాత్వికరావుకి ఏం చేయాలో తోచలేదు.

"చూడండి సార్! ఎక్కడో ఏదో పొరపాటు జరిగింది... అదివరకు కూడా ఎవరో ఈమెను ఏదో చేస్తే నేనే అనుకొని ఈ రాధగారు మా బ్యాంకుకొచ్చి ఒక చెంప పగల గొట్టారు... రెండోసారి మళ్ళీ ఇంకెవరోఅమ్మాయి నన్నింకెవరో అనుకొని హోటల్లో పలుకరిస్తే ఇదే రాధగారు అపార్థం చేసుకొని రెండో చెంప పగలగొట్టారు. ఇప్పుడేమో ఏకంగా నా భార్యననీ, నాతోపాటు ఎప్పటి నుంచో కాపురం చేస్తున్నాననీ అంటున్నారు...."

అతని మాటలు పూర్తి అవకుండానే... లలితాదేవి గుండెలు బాదుకుంటూ–

"అసలు మాకు పెళ్ళే కాలేదంటున్నాడు దేవుడో! ఈ దిక్కుమాలిన మనిషి నన్ను దిక్కులేని దాన్ని చేసి పోవాలనుకుంటున్నాడు... దేవుడో..." అంటూ పెద్ద ఎత్తున శోకాలు ప్రారంభించింది.

"ఇదిగో చంద్రబోస్! ఇంట్లోకెళ్ళవయ్యా. అయిందేదో అయిపోయింది. ఆ అమ్మాయిని ఎందుకలా హింసలు పెడతావు?" అన్నాడింకో ముసలాయన.

"నా పేరు చంద్రబోసు కాదండీ.... సాత్వికరావు."

"అలాగా! నువ్వు మున్సిపల్ స్కూల్లో టీచర్ని కూడా కాదని అంటావనుకున్నాను!"

"అవునండీ! అంటే కాదండీ... నేను టీచర్ని కాదు. బ్యాంకులో క్లర్కుని!" అన్నాడు.


అందరూ ఘొల్లుమని నవ్వారు.

"మేం చెవులో పూలు పెట్టుకుంటే... నువ్వు బర్కత్‌పురాలో ఉంటానని కూడా అంటావు!"

"అవునండీ. బర్కత్‌పురాలోనే మా ఇల్లు!"


మళ్ళీ అందరూ ఘొల్లున నవ్వారు.

"ఇక నాటకాలు చాల్లే గానీ ఇంట్లోకెళ్ళు. డబల్ యాక్షన్ తెలుగు సినిమాలు మేమూ చూస్తున్నాం గానీ వాటిని ఇలా ప్రాక్టీస్ చేసేంత మూర్ఖులం కాదు!" అంటూ అందరూ అతనిని ఇంట్లోకి గెంటేశారు.





నవ్వు కొమ్మచ్చి




ముందు గది తలుపులు మూసేసి ఎందుకైనా మంచిదని తాళం వేసేసింది లలితాదేవి.

దిగులుపడి కుర్చీలో కూలబడ్డ సాత్వికరావు దగ్గరకు నెమ్మదిగా వచ్చింది.

"ఎంత చెడ్డవారండీ మీరు... ఇవ్వాళ మన పెళ్ళి రోజన్న విషయమైనా నాకు గుర్తు చేయలేదు. మీరు వెళ్ళిపోయాక... మీ డైరీ చూసి చదివితే నాకా విషయం తెలిసింది... నాతో ఆ మాట ముందే చెబితే మీతో అలా పోట్లాడేదాన్నా? రండి. సగం రాత్రయింది... ఆ బురద బట్టలు వదిలేసి... త్వరగా స్నానం అదీ కానిస్తే ఈ ఒక్కరోజయినా అదీ కానిద్దాం!"

"రాధగారూ!... మీరేం మాట్లాడుతున్నారో నాకేమీ అర్థం కావటం లేదు! మనకి పెళ్ళయిపోయిందంటారేమిటి?"

లలితాదేవి మళ్ళీ కన్నీళ్ళు పెట్టుకుంది.

"ఇదిగో! నన్నింకోసారి రాధా, బాధా, గాధా అన్నారంటే నాకు మళ్ళీ పిచ్చి కోపమొస్తుంది!"

సాత్వికరావు నివ్వెరపోయి చూస్తుండిపోయాడు.

"అలా చూస్తారేమిటి? పదండి. మిగతా అన్ని రోజులూ ఎలాగూ మీరా సైన్స్ ల్యాబ్‌కే అంకితం కదా! కనీసం ఈ ఒక్క రోజయినా ఆ కెమిస్ట్రీ మర్చిపోయి బయాలజీ చదవండీ!"

"రాధా! ఇదంతా మీరు సరదాకి చేస్తున్నారు కదూ!... నన్ను ఇంకా ఇన్సల్ట్ చేయటానికి అందరితోనూ నాటకమాడిస్తున్నారు కదూ?"

"అదిగో... మళ్ళీ పిచ్చి మాటలు మాట్లాడుతున్నారు. ఆ చెరువులో దూకేసరికి మీ మతి పోయినట్లుందిఁ" అంటూ బలవంతంగా చేయి పట్టుకుని బాత్‌రూములోకి లాక్కెళ్ళి తలుపేసింది.

ఫ్రిజ్ లోంచి మల్లె పూలు తీసి పెట్టుకుంది.

మంచం మీద తనని పడుకోబెట్టి ఆమె పక్కనే పడుకునేసరికి సాత్వికరావు కంగారు పడి లేచి కూర్చున్నాడు.

"అయ్యో! మళ్ళీ లేచారేమిటి?"

"అబ్బే! ఏమీలేదు..." **(సశేషం)**






**వానాకాలం వచ్చేసింది! అసలు 'వానాకాలపు చదువులు' అని ఎందుకంటారో తెలీదు! బాగా వర్షాలు పడితే బడులకు సెలవు యిచ్చేస్తారు కాబట్టి తరగతులు జరగక, మాస్టార్లు పాఠ్యప్రణాళిక త్వరగా పూర్తిచేయలేరని కాబోలు!**

**కావచ్చు కానీ... వర్షంలో బయట తిరగడం సాధ్యం కాదు కనుక, ఇంటిపట్టున వుండి పిల్లలు చదువుకోవడం... హోంవర్క్‌లు చేసుకోవడం... నిజానికి ఇంచక్కా కుదురుతుంది కదా! అంచేత 'వానా వానా వందనం!' అని దణ్ణాలు పెట్టుకోవచ్చు!**

"మనం ఇల్లా అంటే వాళ్ళు 'అల్లా' అంటారు" అని సౌదీల గురించి అంటాంగానీ, అసలు అమెరికా పిల్లలు 'రెయిన్ రెయిన్ గో ఎవే' అని వానాకాలాల్లోనూ పాడుతూవుంటే మనం మాత్రమే - 'వానల్లు కురవాలి వానదేవుడా! వరిచేలు పండాలి వానదేవుడా!' అని వానల్ని ఆహ్వానిస్తాం! నిజమే కదా!! ... 'నీరే ప్రాణాధారం' అన్నప్పుడు వర్షపు చుక్క లేకపోతే బ్రతుకు దాహార్తి తీరేదెలా?... వాన కోసం ఎదురు చూడడం అనేది రైతు బ్రతుకులో ఓ భాగం. వర్షాలు కురవడం కోసం కప్పలకు పెళ్ళిళ్ళు చేయడమూ వుంది! ఎండల వేడికి తాళలేక నీళ్ళు కూడా కుజాల్లోవీ, ఫ్రిజ్జుల్లోవీ త్రాగడం, చలివేంద్రాలు పెట్టుకుని నీరు దానం చేయడం మన సంస్కృతే!




కోట్లాది రూపాయలు పెట్టి అపార్ట్‌మెంట్లూ, విల్లాలూ కొనేవారు కూడా ముందు ఆ ఏరియాకు నీటికొరత లేదు కదా అనే నిర్ధారించుకుంటారు. సరే! ట్యాంకర్లు తెప్పించుకునే స్థితిని తప్పించుకోవడమూ కొండొకచో కుదరదనుకోండి అంచేతే నైరుతి ఋతుపవనాలు వచ్చి... తొలకరి మొదలై, ఈ మాటు వానలు సమృద్ధిగా కురుస్తాయనే మాట వింటేనే... మనసు ఉప్పొంగుతుంది.

'తిట్టే నోరూ, తిరిగే కాలూ ఊరుకోవన్నట్లు- వానల్లో కూడా బలాదూరు తిరిగేవాళ్ళుండొచ్చు. వాన పడుతుంటేనేం?... 'గొడుగు' అనేది ఒకటుంది కదా! ఎండ నుంచీ, వాన నుంచీ రక్షించే ఏకైక సాధనం అదే! 'నా పేరు బుడుగు. ఇంకో అస్సలు పేరుంది. అది చాలా పొడుగు. కావలిస్తే మా నాన్నని అడుగు. మా నాన్న నాకు గొడుగు...' అని బుడుగు అన్నట్లుగా... 'గొడుగు' అంటే 'రక్షణ'కు పర్యాయం మరి.

గొడుగు ఉపయోగాలు అడుగు అడుగునా కానవస్తూనే ఉంటాయి. చిటపట చినుకులు పడుతూ వుంటే చెట్టునీడకు పరిగెట్టక్కర్లేకుండా- అమ్మాయి, అబ్బాయి ఒకే గొడుగు క్రిందకు చేరారంటే చాలదూ! వలపువానలో తడిసినట్లే!

సినిమాల్లో వానపాటలు, వానదృశ్యాలు... గురించీ వేరే చెప్పాలా? 'ఆకుచాటు పిందె తడిసె' అని పైకి అంటూ, అసలుకు - వానలో తడిసిన హీరోయిన్ అందాలు వెండితెర మీద ఆరబోసాక, 'ఆరేసుకోబోయి పారేసుకున్నాను' అనుకోనక్కర్లేకుండానే-నిర్మాత పెట్టిన పెట్టుబడి మీద లాభాలు ఆర్జించడం కోసం వేరే అర్థించడం ఎందుకు? ప్రేక్షకులే కనకవర్షం కురిపించేస్తారుగా!

ఎండా, వానల నుంచే కాదు - అప్పులవాడి నుండి కూడా తప్పించుకోవడానికీ... గొడుగే రక్షణ సాధనం అని అప్పుల అప్పారావు ఊరికే అన్లేదు! చంకలో మడిచిన గొడుగు పెట్టుకుని గానీ... వర్షాకాలం బయటకు అడుగుపెట్టని మగానుభావులు వున్నారు.

అయితే అదేం చిత్రమో గానీ... మనం గొడుగు పట్టుకెళ్ళిన రోజున వానపడదు. పొర


పాటున ఇంట్లో మరిచి వెళ్ళినరోజు మాత్రం కుండపోతగా కురిసి, తడిపేస్తుంది. వానలో గొడుగేసుకు వెళ్ళొచ్చాక మతిమరుపు ప్రొఫెసర్ గారు గొడుగును సోఫాలో పెట్టి, తాను గోడ వార కెళ్ళి నించున్నాట్ట!

అసలు గొడుగుల వ్యాపారం బ్యూటీయే వేరు!... రంగురంగుల గొడుగులు వేసుకుని జర్మనీ =వాళ్ళూ, చైనావాళ్ళూ ఎక్కువ ఫోజులు కొడతారని ఆ విదేశాలంటే మోజులున్న మన వాళ్ళే అంటూంటారు.

ఒకప్పుడు 'గొడుగులు బాగుచేస్తాం!' అని వీధుల్లో అరుస్తూ గొడుగులు బాగుచేసే వాళ్ళొచ్చేవారు కూడా! 'గొడుగుకర్ర' పట్టుకోవడం కూడా ఒక కళ! మీటనొక్కితే విచ్చుకునే గొడుగులు వాడే విద్య కూడా అందరికీ తెలుసుండకపోవచ్చు! ఇంద్రుడు భోరున కావాలని ఎడతెగని కుంభవృష్టి వానలు కురిపిస్తూంటే, తన చిటికెన వేలుమీద గోవర్ధన పర్వతాన్ని గొడుగులా పట్టి ప్రజలను, ఆలమందలను రక్షించాడు కనుకనే – కృష్ణుడు భగవంతుడయ్యాడు.

గొడుగును చిటికెన వేలుతో పట్టుకోవడం మన బోంట్లకు సాధ్యమా చెప్పండి? చిటికెన వేలు చూపిస్తే తరగతి గదిలో మాస్టారు... 'పోరా వెధవా! ఎన్నిసార్లు అలా' అని కోప్పడినా, ఎక్కడ బెంచి ఖరాబవుతుందోనని పంపడమే చాలామందికి చిన్ననాటి జ్ఞాపకంగా తెలుసు మరి!

'వానావానా వల్లప్పా'అని వానలో తడుస్తూ–




గెంతులు వేయడం, వాననీటిలో కాగితం పడవలూ, కత్తిపడవలూ వేసి, ఆ ప్రవాహానికి అవి వెడుతూంటే – ఆ పక్కనే పరిగెత్తుతూ వెళ్లడం, చాలామందికి గుర్తుండే బాల్యపు మధురిమలే!

వానలో కూడా రకాలు వున్నాయి తెల్సుగా!

ఒకటి సాధారణ వర్షం (Conventional Rain Fall).

రెండోది పర్వత వర్షం (Orographic Rain Fall).

మూడోది చక్రవాత వర్షం (Frontal/ Cyclonic Rain Fall).

నాలుగవది కారుమేఘవర్షం (Thunder Storm Rain Fall).

అయిదోది ఆవికిరణం Hailstorms.

సరే! చినుకులు (Drizzle) మరొకటి. తుఫాను వర్షం (Torrential Rain) అనేది తీవ్రమైన వర్షపురూపం మరి! తుఫాన్‌లకు పేర్లు కూడా పెడుతూంటారు.

'గాలి వానలో... వాననీటిలో... పడవ ప్రయాణం' పాటగా బాగుండచ్చు గానీ, ఆ 'పాట్లు' వేరేకదా!

మన కథని ప్రపంచ స్థాయిలో నిలిపింది పాలగుమ్మి పద్మరాజు గారు రాసిన – 'గాలి వాన' కథే! వాన నీరు ప్రాముఖ్యత నెరిగే, వాటిని భద్రపరిచే ప్రణాళికలు – 'ఇంకుడు గుంతలు' నుండి మొదలెట్టి, ఇంకెన్నో ప్రభుత్వ పథకాలున్నాయి.' రేడియోలో 'వాతావరణ సూచన' కూడా ఒక ప్రత్యేక కార్యక్రమంగా అలరారేది ఒకప్పుడు. తుఫాను హెచ్చరికల వార్తలు వలనే జాలర్లు సముద్రం మీదకి చేపలు పట్టడానికి వెళ్ళేవారు.

అంచేత వర్షం యొక్క గొప్పదనం తెలుసుకోవాలి. ఈ సంగతుల పట్ల ఆసక్తి లేదంటే 'దున్నపోతు మీద వర్షం పడ్డట్లే'... అనేసే ప్రమాదం ఉంది.

అంచేత ప్రమాద హెచ్చరికల జెండాలు ఎగరేయకుండా మంచి విషయాలకు 'గొడుగు' పట్టడం అవసరం!

అంచేత వానలూ జిందాబాద్!!

గొడుగులూ జిందాబాద్!!!

నవ్వుల వానలో తడిపే....

హాస్యానందం జిందాబాద్!!!






**మొదటి సీన్ -అవధానుల విజయలక్ష్మి**

**పల్లవి:**

అతను: వెర్రి... వెర్రి... వెర్రి... వెర్రి... వెర్రీ!
భలే వెర్రి ... ఆహా వెర్రీ... వేపకాయంతేమో వెర్రి!
మగాళ్ళ కోరస్: వెర్రంటే మజాకా! వెర్రంటే తమాషా!
ఆమె: పిచ్చి... పిచ్చి... పిచ్చి... పిచ్చి... పిచ్చీ...
భలే పిచ్చీ... ఆహా పిచ్చీ...పండు మిరపకాయలాంటి పిచ్చీ!
ఆడవాళ్ళ కోరస్: పిచ్చంటే మజాకా! పిచ్చంటే తమాషా!

**చరణం:**

అతను: వెర్రీ పిచ్చీ కలిస్తేనే అసలైన ప్రేమా...
ఆమె: పిచ్చీ వెర్రీ కలిస్తేనే అసలైన దోమా...
ఇద్దరూ: పిచ్చ పిచ్చగా ప్రేమించు కొందామా?
కాలేజీ మానేసి మూవీ కెళ్దామా? ॥వెర్రి వెర్రి॥

**చరణం:**

అతను: వేపకాయ మిరపకాయ కలుస్తేనే ప్రేమా...
ఆమె: వేపకాయ పచ్చడంటే అదే అదే సుమా...
ఇద్దరూ: పచ్చడి చేసుకుందామా?
ముద్దలు తినిపించుకొందామా? ॥వెర్రి వెర్రి॥

పాట రాయడం పూర్తి చేసి వేళ్ళు విరుచుకొన్నాడు శేషాచలం.

ఆ పాట మళ్ళా మళ్ళా చదువుతుంటే తనకే ఇంత హుషారు వస్తుంటే, సినిమా చూస్తున్నవాళ్ళకి ఇంకెంత హుషారు వస్తుందో! గర్వంగా మీసాలు మెలేసాడు అరవై ఏళ్ళ శేషాచలం.

"ఇదిగో నిన్నే, మొన్న ఆవకాయకని తెప్పించిన ఎండు మిరప కాయలు ఇంకా ఆడించలేదుకదే?" వంటింట్లోకి చూస్తూ కేకేశాడు.

"ఏదీ... మీరు ఇప్పటినుండే మిల్లు పట్టించవద్దన్నారుగా! ఇంకా ఎప్పుడండీ మీ షూటింగూ? అయినా మీ బోడి సినిమా షూటింగుకి నా రెండు కేజీల మిరపకాయలే కావలసి వచ్చాయా!?" వంటింట్లోంచి అరిచింది కాంతం.

"అసలే ధరలు మండిపోతున్నాయి కదే? కొంత డబ్బు కలసి వచ్చినా వచ్చినట్లే..." ఫోన్లో తాను రాసిన పాటను మరొకసారి చూసుకొంటూ అన్నాడు శేషాచలం.

వీళ్ల మాటల్లో వుండగానే అక్కడికి కింది అంతస్తులో ఉండే పద్దెని మిదేళ్ళ మహేష్ వచ్చాడు.

"తాతగారూ! పాట రాయడం అయిపోయిందా?" అంటూ.

"ఇదిగోరా ఇప్పుడే పూర్తిచేశాను. చదివీ ఎలా ఉందో చెప్పు!..." అన్నాడు శేషాచలం తన చేతిలోని ఫోన్ అందిస్తూ.

"అబ్బా! ఎంత బాగా రాసేసారో!... మన మూవీకి వన్ మిలియన్ వ్యూస్ ఖాయం. మీరు ఎలాగైనా గ్రేట్ తాతగారూ! ఎప్పుడూ కాలంతో బాటు చక్కగా అప్‌డేటేడ్‌గాఉంటారు!" అన్నాడు మహేష్ హుషారుగా... శేషాచలం వైపు ఆరాధనగా చూస్తూ.

✦✦✦

అసలు విషయం ఏమిటంటే... శేషాచలం కొన్ని నెలల క్రితమే పదవీ విరమణ చేశాడు. చేతిలోకి కాస్తో కూస్తో డబ్బులు వచ్చి పడ్డాయి.

ఆ డబ్బులో చాలా భాగం భార్య కాంతం లాగేసుకోగా, బతిమాలి బామాలీ ఓ లక్ష రూపాయలు తన కోసం వేరే పెట్టుకొన్నాడు.

దానితో ఒక చిన్న ఓటీటీ సినిమా తియ్యాలన్న ఉద్దేశంతో.

తన చుట్టూ ఉన్న చాలామంది కుర్రాళ్ళు ఇలా ఒక చిన్న సినిమా తీసేసి అలా లక్షలు సంపాదించేస్తున్నారు. తానేనా తక్కువ తిన్నది!

"ఏమండీ లక్ష రూపాయలతో చక్కగా వజ్రపు ముక్కుపుడక వస్తుంది. ఎందుకండీ ఆ దిక్కుమాలిన సినిమాలు?" అని కాంతం నెత్తీ నోరూ కొట్టుకొంది.

అయినా మన శేషాచలం చలించలేదు.

"కాంతం మన సినిమా హిట్టయితే నీకు వజ్రపు ముక్కుపుడక ఏమిటే, ఏకంగా వడ్డాణం చేయిస్తాను!" అన్నాడు కన్ను కొడుతూ.

✦✦✦

"అయితే తాతగారూట ఈ పాట పిక్చరైజేషన్ ఎలా ఉంటుంది?" అడిగాడు మహేష్.

అతనే శేషాచలం తియ్యబోయే సినిమాలో హీరో!

ఈ మహేష్‌కి వాళ్ల అపార్ట్‌మెంట్లో జనవరి ఒకటో తారీఖున వేసిన డ్రామాలో ఐదు నిమిషాలు నటించిన అనుభవం ఉంది.

తక్కువ ఖర్చుతో అయిపోతుందని అతన్ని హీరోగా తీసుకొన్నాడు శేషాచలం. తన అమ్మా నాన్నలకు షూటింగ్ విషయం తెలియకూడదు అన్న షరతుమీద సినిమాలో నటించడానికి ఒప్పుకొన్నాడు మహేష్ ఆనందంగా.

ఇంకా హీరోయినే ఎవరో నిర్ణయం కాలేదు.

ఆ పాట పిక్చరైజేషన్ ఎలా ఉంటుందో వివరించడం మొదలెట్టాడు శేషాచలం.

"హీరో, హీరోయినూ తోటలో పరిగెడుతూ... ఈ పాట పాడుతూ ఉంటారన్నమాట. మన అపార్ట్మెంట్ వెనక చిన్న వాకింగ్ గ్రౌండ్ ఉంది చూడు అక్కడ ఈ పాట తీస్తాం అన్నమాట.

మొదట హీరోయిన్ మీద దోసిళ్ళతో వేపకాయలు రాల్తాయి... ఆ తర్వాత హీరో మీద చేటలతో ఎండుమిరపకాయలు రాలతాయి. పసుపుపచ్చగా వేపాకాయలూ, ఎర్రటి ఎరుపుతో ఎండు మిరప కాయలు!! భలే ఉంటుందిలే సీను..."

శేషాచలం ఇంకా చెప్తూ వుండగానే పక్కన ధడేలుమని చప్పుడ యింది.

పక్కన మహేష్ మూర్ఛపోయి ఉన్నాడు.

✦✦✦



## రెండవ సీన్ –డా॥చారి

"అయ్యయ్యో ఏవైందండీ?... మహేష్ ఏవి టలా పడిపోయాడూ!?" కాఫీ కప్పు తెచ్చిం దల్లా గాభరాగా చూస్తూ అంది కాంతం.

"ఏమోనే... సాంగ్ పిక్చరైజేషన్ అడిగాడు చెప్పానంతే..."

"ఇంకా ఒక్క పెళ్లి కూడా కాలేదా కుర్రాడికి! వాళ్ళమ్మడిగితే ఏం సమాధానం చెప్పేది?... ఆవిడకసలే కాలనీ డైనోసర్ అనే పేరు కూడా ఉందాయె..." కాఫీ కప్పుని స్టాట్యూ ఆఫ్ లిబర్టీలా పట్టుకుని నిలబడిపోతూ అంది.

"అబ్బా!... నువ్వు కంగారు పడి నన్ను కంగారు పెట్టకే. వెళ్ళి కాసిన్ని నీళ్ళు తే...." ఓ చేత్తో మహేష్ నాడి పట్టుకుని చెవి గుండె మీద ఆన్చాడు.

ఇంతలో కాంతం నీళ్ళు తేవడం కాసిన్ని నీళ్లు మహేష్ ముఖం మీద చిలకరించడం జరిగిపోయాయి.

మహేష్ టక్కున లేచి కూర్చున్నాడు.

"అదేంటయ్యా మహేష్ అలా బెదరగొట్టేవ్! పైత్యం ఏమన్నా పెరిగిందేమో... అల్లం రసం తెమ్మంటావా?" అడిగింది కాంతం.

మహేష్ వద్దంటూ నీరసంగా తలూపాడు.

"మీ యువతకి బొత్తిగా క్రియేటివిటీ లోపిం చిందోయ్ మహేషూ... మా కాలంలో ఓ దర్శ కేంద్రుడు ఉండేవాడు... ఆయనైతే ఏకంగా బత్తాయిలు, ద్రాక్షలు, మామిడిపళ్ళు, పుచ్చ కాయలు అని ఎన్ని ప్రాపర్టీస్ వాడేవాడని...! ఆయన కాలంలో పళ్ళతోటల రైతులు రెండు చేతులా ఆర్జించేవాళ్ళు...ఇదో టైపు రైతుబంధు అనుకో! నేనూ ఉడతా సాయంగా మిర్చి రైతులకీ, వేపచెట్లకీ పునర్వైభవం తెద్దాం అనుకున్నా. నిన్ను చూస్తే ఆవేమీ సాగేలా లేవు. పైగా... ఆ ఫోర్నాట్ ఎయిట్ ప్రతిభా రాణిని హీరోయిన్ అనుకున్నా. ఆ పిల్ల మంచి డాన్స రట!... వరసగా మూడుసార్లు డాన్స్ ప్రోగ్రాం లో పాల్గొన్నందుకు స్పెషల్ జ్యూరీ అవార్డు కూడా ఇచ్చారట మన అపార్ట్‌మెంట్ కమిటీ మెంబర్స్... పోనీ కింద వాచ్‌మేన్ కొడుకు న్నాడు కదా వాణ్ణి హీరోగా పెడదామా?" ఓ రాయి వేసి చూసాడు శేషాచలం.

"తాతగారూ!... ఏం మాట్లాడుతున్నారు! ఇంకా టిఫిన్ చేయకపోవడంతో ఏదో కాస్త కడుపులో తిప్పిందంతే... ఈ సినిమాలో నేనే హీరో! ప్రతిభే హీరోయిన్!" ధమ్మని లేచాడు మహేషు.

"అద్దీ... కుర్రాడంటే నీలా ఉండాలి... ఆ! ఇంతకీ ఆ కాస్ట్యూమ్స్ అవి కొనుక్కోమన్నాను కదా మర్చిపోకేం..." బయలుదేరుతున్న మహేష్‌కి మరోసారి గుర్తు చేసాడు శేషాచలం.

"ఏవిటండి మీ సినిమా పిచ్చికి ఆ కుర్రాణ్ణి బలి చేస్తున్నారు!" కాంతం ఇంతకు మునుపు నేల మీద పెట్టేసిన కప్పుని మళ్లా స్టాట్యూ ఆఫ్ లిబర్టీలా అలాగే పట్టుకుని అంది.

"ముందా కప్పు దించు కాంతం! రేపు మన పిక్చర్ హిట్ ఐతే అసలు మహేష్‌ని మనం పట్టుకోగలమా!... చూస్తావుగా నా డైరెక్షన్ ట్యాలెంట్..." అంటూనే స్క్రీన్‌ప్లేకి వెయ్యి సూత్రాలు అనే బుక్ తెరిచాడు శేషాచలం.

కాంతం చల్లారిపోయిన కాఫీ పట్టుకుని... వంటగదిలోకి నడిచింది.


✦✦✦


ఆ రోజు సాయంత్రం వాకింగ్‌లో శేషా చలాన్ని కలిసాడు ఏకనాథం.


ఏకనాథం నాన్నగారి నాన్నగారు సినిమాల్లో స్పెషల్ ఎఫెక్ట్స్ డిపార్ట్‌మెంట్లో పనిచేసిన మనిషి.

కాస్తోకూస్తో సంపాయించాడు కూడా.

దాంతో ఆయన ఆస్తిని పంచుకోవడానికి ఆయన పేరు పెట్టించుకున్న వాళ్ళ లిస్టులో మన ఏకనాథం కూడా ఉన్నాడు.






ఆస్తి దక్కలేదు గానీ... ఎలా అబ్బిందో మనోడికి వీడియోగ్రఫి అబ్బింది.

రిటైర్ అయ్యాక నైంటీన్ సెవెంటీ ఫోర్ మోడల్ వీడియో రికార్డర్‌తో కాలనీ అందా లను క్యాప్చర్ చేస్తూ... శేషాచలం కంట్లో పడ్డాడు.

ఆయన టాలెంట్ చూపించుకోవాలనే కోరిక ఆయనది!

ఫ్రీగా కెమెరామెన్ దొరికితే ఖర్చు కలిసొ స్తుందనే బాధ మన శేషాచలానిది.

“గుడీవినింగ్ డైరెక్టర్ సార్... ఎంతవరకూ వచ్చిందేవిటి మన సినిమా కథ?” ఏకనాథం మెళ్ళో మఫ్లర్ సరిచేసుకుని శేషాచలం పక్కనే వాకింగ్ చేస్తూ అడిగాడు.

“రెడీ...కానీ...”

“కానీ... కల్లుముంతా...ఈ మాటలొద్దు సార్! జపాన్లో నా కెమెరా ఫిల్మ్ దొరుకు తుందంట... తెప్పించేస్తా! వాళ్ళే పురాతన వస్తువులని జాగ్రత్త చేసుకునేది...” ఏకనాథం ఆవేశంగా అన్నాడు.

“ఆ కెమెరాతో షూటింగ్ చేస్తే మళ్ళీ మనం బ్లాక్ అండ్ వైట్ యుగంలోకి వెళ్ళాలి... సిని మాటోగ్రఫీ మీరే! కెమెరా మారుద్దాం... ఫిల్మ్ నగర్లో కెమెరాలు అద్దెకిస్తారట కనుక్కోండి. మనదసలే లో బడ్జెట్ ఫిలిం!”

“అసలే పెన్షన్ డబ్బులు ఇన్సులిన్‌కే చాలడంలేదు... మళ్ళీ కెమెరా అద్దెకా?” అక్కడే ఆగిపోయాడు ఏకనాథం.

అంతవరకూ వాళ్ళిద్దరికీ తెలియకుండా ఫాలో అవుతున్న డ్రామా ఆర్టిస్టు సుయోధన రావ్ సడెన్‌గా చెట్టు వెనక నక్కాడు.

“ఇలా డీలా పడితే మన పిక్చర్ కేన్స్‌లో కాదు కదా బెజవాడ కృష్ణా థియేటర్లో కూడా ఆడదు... ధైర్యే సాహసే లక్ష్మి అన్నారు! ఏమో, మన పిక్చర్ హిట్ ఐతే ప్రకృతి ఆశ్రమంలో ట్రీట్‌మెంట్ చేయించుకుని... డయాబెటిస్ పోగొట్టు కుంటావేమో...” వాకింగ్ స్టిక్ తాటిస్తూ వేగంగా నడిచాడు శేషాచలం.

“మీరు ఓ.టి.టీ ఫిల్మ్ అన్నారు...” ఏక నాథం ఓ క్షణం ఆగి ఆయన వెనుకే పరి గెత్తాడు.

“శేషాచలం అంటే ఫారెస్ట్ అనుకుంటివా! ఫైరు!” వెనక్కి తిరిగి నవ్వాడు శేషాచలం.

## మూడవ సీన్ –మైనా విశ్వకర్మ


**“అంటే...** అంటే ఏమిటి సినిమా ఏకంగా థియేటర్లలో ఆడించేస్తారా?” ముందు వెడు తున్న శేషాచలాన్ని కాస్త నడకలో వేగం పెంచి అడిగాడు ఏకనాథం.

శేషాచలంలో నిజంగానే ఆ పూట కాస్త ఫైరు ఎక్కువగా ఉందేమో... రెండు చేతులూ కెమెరాలా పెట్టి...

“సినిమా చూపిస్త మామా నీకు, సినిమా చూపిస్త మామా...” అంటూ రెచ్చిపోయాడు.

వాళ్ళని అనుసరిస్తూ చెట్టు వెనక నక్కిన సుయోధన రావుకి వాళ్ళ మాటలు వింటుంటే పిచ్చెక్కినట్లనిపించింది.

**(ఏం చేశాడో వచ్చే సంచికలో...)**






**ఆధునికత పెరిగిన ఇప్పటి తరంలో భాష కూడా ఎన్నో ఆధునిక పోకడలు పోతోంది. దీని వల్ల అర్థాలు మారి అనర్థాలు జరుగుతున్నాయి. తెలుగు మాట్లాడే క్రమంలో జరిగే పొరపాట్లు, వాటివల్ల జరిగే తప్పులు, వాటిని సరిచేసుకోవాల్సిన విధానాలు అందరికీ తెలియజేయాలనే సంకల్పంతో... భాషా చమత్కారాన్ని ఉపయోగిస్తూ చేస్తున్న ప్రయత్నం ఇది.**

డాక్టర్ కప్పగంతు రామకృష్ణ
*తెలుగు అధ్యాపకుడు, కె.బి.ఎన్ కళాశాల, విజయవాడ*
90320 44115

**(గత సంచిక తరువాయి)**

**"నా** మాట కాదనకండి మాస్టారూ... మీరీ కార్యక్రమానికి తప్పని సరిగా రావాల్సిందే. మీరు కాదంటే నామీద ఒట్టే... ఇక అంతే... మాటల్లేవు మాట్లాడుకోటాల్లేవు..." అంటూ సినిమా ఫక్కీలో మాట్లాడుతూ, ఆహ్వానపత్రం నా చేతిలో పెట్టి... క్షణంలో మాయమయ్యాడు జితేంద్ర.

ఇంతకీ అతగాడు నన్ను పిలిచినట్లా? పిలవనట్లా? నాలో మీమాంస మొదలైంది.

"ఈసారి బలయ్యేదెవరో..." అంటూ రత్నం ఆహ్వానపత్రం లాక్కుని గబగబా చదవటం మొదలుపెట్టింది.

'ఏమిటే! రానురాను మరీ నీక్కూడా అలుసైపోయానా?' అనే లోపలే...

రత్నం ఏమాత్రం పట్టించుకోకుండా కిల కిలా నవ్వుతూ వంటింట్లోకి పరుగుతీసింది.

ఆ నవ్వుకి అర్థం ఏమిటో ఇప్పటికీ అర్థం కాలేదు నాకు.

సరే... ఆ సంగతి అటుంచుదాం!

గట్టిగా పిలిచేసరికి కాదనలేక, కావాలనే కొంచెం ఆలస్యంగా... అయిష్టంగానే కార్యక్రమానికి వెళ్ళా... అప్పటికే అధ్యక్షోపన్యాసం అయినట్లుంది. ఇంకెవరో మాట్లాడుతున్నారు.


"తెలుగు మాస్టారు వచ్చారు! భలే... ధన్యవాదాలు మాస్టారూ..." అంటూ నిర్వాహకుల్లో ఒకరైన నరసింహం నన్ను ఆప్యాయంగా ఆహ్వానించి, నేను వద్దంటున్నా వినకుండా ముందువరుసలో కూర్చున్న వ్యక్తిని లేపి మరీ నన్నా కుర్చీలో కూర్చోపెట్టాడు.

పక్కన కుర్చీల్లో ఉన్న మరో ఇద్దరు కూడా ఖాళీ చేసి, వెనక్కి వెళ్ళారెందుకో మరి! నరసింహం పక్కనే కూర్చుని, నా చేతులు విడవకుండా పట్టుకున్నాడు. ఎందుకో అర్థం కాలేదు ఎంత ఆలోచించినా.

ఆ రెండో వ్యక్తి ఉపన్యాసం కూడా అయిపోయింది. సభా నిర్వహణ చేసే వ్యక్తి మైక్ అందుకుని... అంతకుముందు మాట్లాడిన వ్యక్తికి ధన్యవాదాలు చెప్పి, ముఖ్య అతిథిని మాట్లాడమని ఆహ్వానించాడు.

చాలా అతి వినయం, సొంతం కనబడని దర్పం అభినయిస్తూ ముఖ్యఅతిథి పూర్ణచంద్రరావు ప్రసంగం ప్రారంభించాడు.

"అంతా కులాసా అని భావిస్తాను. నేను అంచలంచలుగా ఎదిగిన వ్యక్తిని. మా పూర్వీకులు కరణీకం చేసారు...కామందులు కూడా మా పెద్దల్ని ఎంతో గౌరవించేవాళ్ళు... ఆ రోజులు ఇప్పుడు లేవు... హనుమంతుడు లంకలో ఉన్న సీతమ్మకు రాముడి అంగుళీయాన్ని




'అమ్మమ్మో అమెరికా!' సౌజన్యంతో

చూపించినట్లు, మా పెద్దవాళ్ళని చూపించాల్సి వస్తోంది. మా ప్రతిష్ట తరతరాలుగా వస్తోంది...."

అదేదో సినిమాలో చూపించినట్లు నా చేతుల్లోని నరాలు ఉబ్బుతున్నాయి. పటపటా పళ్ళు కొరుకుతున్న శబ్దం, పిడికిలి బిగించి... ఆవేశాన్ని ఆపుకుంటున్న హీరో ఫీలింగ్!

పరిస్థితి అదుపుతప్పుతోందని గ్రహించినట్లున్నాడు నరసింహం.

"మాస్టారూ... ఇది సమయం కాదు! కాస్త తట్టుకోండి. ఈ ఒక్క ఉపన్యాసం అయిపోతే చాలు! కార్యక్రమం విజయవంతం అయినట్లే.

మీ కాళ్ళు పట్టుకుంటా..." అంటూ ప్రాధేయ పడుతున్నాడు.

'సరే' అని అభయహస్తం చూపించాను.

బతుకు జీవుడా... అనుకుంటూ నా కాళ్ళ దగ్గరే చతికిలపడ్డాడు నరసింహం.

అప్పటికే మా ఇద్దరినీ గమనించిన వెనుక వరుస ప్రేక్షకులు ఏం జరుగుతోందో తెలియక అయోమయ పడుతున్నారు.

పూర్ణచంద్రరావు ఇంకా మాట్లాడుతూనే ఉన్నాడు... 'గుండు చెంబులు పోయాయి... గూండా రాజ్యం నడుస్తోంది. అంతా గురి వింద గింజల మాదిరిగా తయారవుతున్నారు. ఎంతో విశిష్టమైన కార్యక్రమం ఇది. నాకు ఎవరైనా ఒకటే. ఎలాంటి బేధాల్లేవు...' అర్థం అవుతోందా లేదా అన్నట్లు, మొత్తమ్మీద ఏదో చెబుతున్నాడన్నట్లు ప్రసంగం సాగిపోతోంది.


"ఏంటి మాస్టారూ...." ఆత్రం ఆపుకోలేక వెనుక వరుస ప్రేక్షకుడు అడగనే అడిగాడు.

"ఇలా రావయ్యా!" అంటూ అతగాడిని నా పక్కన కూర్చోబెట్టుకున్నా.

"ఇప్పుడు చెప్పవయ్యా... పూర్ణచంద్రరావు గారి పూర్వీకులు ఏం చేసేవారు?"

'కరణీకం'... ఆయనే చెప్పాడుగా!" టీచర్ వేసిన ప్రశ్నకు సరైన సమాధానం చెప్పిన పిల్లా డిలా ఫోజుకొట్టాడా పెద్దమనిషి.

"అదే... అక్కడే... సరిగ్గా అక్కడే మీ ఇద్దరూ తప్పులో కాలేసారు... ఆయన పూర్వీకులు చేసింది **'కరణీకం'** కాదయ్యా... **'కరణికం'**. కరణీకం అనే పదం తప్పు. అదొక్కటే కాదు...




ఇంకా చాలా ఉన్నాయి...ప్రసంగం ప్రారంభం లో అందరూ కులాసానా అన్నాడా? అదికూడా తప్పేనయ్యా!"

"అదేంటండీ!... పలకరించడం కూడా తప్పేనా?" అంటూ బుర్రగోక్కున్నాడా అనా మక పెద్దమనిషి.

"తప్పులేదయ్యా... పలకరించవచ్చు. కానీ, **'కులాసా'** అనే పదం తప్పు. **'ఖులాసా'** అనాలి. ఖులాసా అనేది హిందుస్తానీ పదం. దాన్ని అలాగే పలకాలి. రాయాలి... అంతెందుకు... ఆయన **'అంచలంచలు'**గా ఎదగలేదంటే నువ్వు నమ్ముతావా..."

అనగానే ఆ పెద్ద మనిషి కోపం వచ్చేసింది.

"ఏంటండీ మీరు మాట్లాడేది? పూర్ణచంద్ర రావుగారు దగాకోరు అనేనా..." అంటూ అరిచాడు.

నా కాలు పట్టుకుని కునికిపాట్లు పడుతున్న నరసింహానికి దెబ్బకు మెలకువ వచ్చింది.

అనుభవం ఉన్నవాడు కాబట్టి ఏం జరుగు తోందో ఇట్టే పసిగట్టి, ఏం జరుగబోతోందో ఇట్టే ఊహించి నన్ను వదలి ఆ పెద్ద మనిషి కాళ్ళు పట్టకున్నాడు... ఇంతటితో విషయం వదలెయ్యమని

"దగాకోరు... కొబ్బరికోరు కాదయ్యా.... ఆయన 'అంచలంచలు' గా ఎదగటం సాధ్య పడదు. ఎందుకంటే ఆ పదం తప్పు కాబట్టి. అంచె లేదా అంచియ అంటే వరుస అని అర్థం. కాబట్టి, **'అంచెలంచెలు'**గా అనాలి. అలాగే రాయాలి. ఈమాట విని ఊరడిల్లాడా అనామక పెద్దమనిషి. **(సశేషం)**

'తెలుగా మజాకా!' రచయిత డాక్టర్ కప్పగంతు రామకృష్ణ రచనలు




కాపీలకు: 9032044115, 8897547548 సంప్రదించండి!

# Reverse Gear
# వెనక్కి వెళ్ళే కథలు

గంగాధర్ వడ్లమన్నాటి- 9908445969

## డాబుసరి

**"అదేంటి నాన్నా!... ఇప్పుడు వెనక్కి వెళ్ళిపోతానంటున్నావ్... దర్శనానికి ఇంకో ఐదు నిమిషాలు... అంతే! తీతికపిట్టలా గోలచేయకుండా... కొంత ఓపిక పట్టు! అయిపోతుంది!" నచ్చజెప్పింది లలిత.**

**"అది కాదమ్మా!... నాక్కొంచెం ఏదో ఇబ్బందిగా ఉంది. అర్థం చేసుకోమ్మా!" మొహం విసుగ్గా పెట్టి అన్నాడు శేఖరం.**



అతని మాటలు విన్న అతని వియ్యంకుడు... కాస్త చిన్నగా ముసిముసిగా నవ్వుతూ–

"బావగారూ! మీ ఇబ్బంది నాకు అర్థం అయిపోయింది... మీకు ఇప్పుడు ఇబ్బంది మొదలయ్యింది... కానీ నాకైతే ఇందాక ఏ.సీ కారెక్కగ్గానే ఆ ఇబ్బంది మొదలయ్యింది... కానీ ఇప్పుడు లేదు! ఎందుకంటే నేను డైపర్ వాడతాను! షుగర్‌తో ఇదే చావు. అందుకే మిమ్మల్ని పొద్దున్న కూడా అడిగాను... బావగారూ కావాలా అని. మీరు నావంక తినేసేలా చూశారు. సరే అని నేను మిన్నకుండిపోయాను!" చెప్పుకుంటూ పోయాడు వియ్యంకుడు.

బుర్ర గోక్కుంటూ– "అయ్యో! ఇబ్బందంటే ఆ ఇబ్బంది కాదు బావగారూ! ఇది వేరే... కనుక నన్ను మన్నించి, వెనక్కి పంపించండి." చెప్పాడు శేఖరం.

"అది కాదా! మరేంటి నాన్నా? అయినా నువ్వు సింగినాదం, జీలకర్ర చేయడం కానీ, విశాఖ నుండి ఇక్కడికి నిన్ను విమానంలో తీసుకొచ్చాం. ఈ కొండ మీదకి ఏ.సీ.కారులో తెచ్చాం. మావయ్యగారు కష్టపడి,మంత్రిగారి రికమండేషన్ పట్టుకుని, పట్టుమని పావుగంట పట్టని ఈ వి.ఐ.పీ. దర్శనం క్యూలో నిల బెట్టారు. ఇంకా నీకు ఇబ్బందేంటి నాన్నా! గర్భగుడి వరకూ నిన్ను ఎత్తుకుని తీసుకు వెళ్ళాలా?" విసుక్కుంది లలిత.

"అదికాదమ్మా! ఈ వి.ఐ.పీ లైన్‌లో అదీ వెళ్ళడం బానే ఉందమ్మా. కానీ ఒక లోటు మాత్రం లోతుల నుండి నన్ను ఇబ్బంది పెడుతోంది!" చేతులు నులుముకున్నాడు.

అతని మాటలు విన్న శేఖరం అల్లుడు... కాస్త జాలిగా అతని వంక చూస్తూ–

"పోన్లెండి మావయ్యా! అత్తయ్య లేని లోటు ఎవరూ తీర్చలేనిది. అందుకే మీకు పోయిన్నెలే చెప్పాను... మా దూరబ్బంధువు ఒకామె మొగుడు పోయి ఖాళీగా ఉందీ... పైగా ఆమె దగ్గర బోలెడు ఇన్సూరెన్స్ డబ్బుందీ, మీకు ఇన్సులిన్ చేయడంలో కూడా సాయపడుతుందీ అని. కానీ నా మాట విన్నారు కాదు...

ఇప్పుడు చూడండి ఆ లోటు మిమ్మల్ని ఎలా వేధిస్తోందో..." జాలి మొహం కంటీన్యూ చేశాడు.

"ఎలా అల్లుడూ ఆమెని పెళ్ళి చేసుకోవడం! నా పేరుపై ఓ పెద్ద మొత్తంలో ఇన్సురెన్స్ పాలసీ తీసుకుంటేనే నన్ను పెళ్ళి చేసుకుంటానని కరాకండిగా చెప్పేసింది. దాంతో... ఆ పాడు పాలసీ డబ్బు కోసం... నా పాడె కట్టే క్షణం కోసం ప్రతి క్షణం ఎదురుచూస్తుందేమోననే భయం వేసింది. అయినా లోటంటే ఆ లోటు కాదు!" అని పళ్ళు కొరికేసి...

కూతురి వైపుకి తిరిగి– "అమ్మా! నేను ఇక్కడ చెప్పలేకపోతున్నాను. చెబితే మీ అత్తమామలు ఏమన్నా అనుకున్నా అనుకుంటారమ్మా!" అన్నాడు బేలగా చూస్తూ.

"అబ్బా! మావయ్యా... మా అమ్మ,నాన్నలు ఏం అనుకోరు!...ఎందుకంటే, వాళ్ళకీ అసలు విషయం తెల్సుకదా! ఇది త్వరగా అయిపోతే మనమంతా ఎక్కడైనా బ్రేక్ ఫాస్ట్ చేసి, తర్వాత ఎయిర్‌పోర్ట్‌కి వెళ్ళాలి. ఆ తర్వాత బెంగళూర్ చేరి, మనం మైసూర్ పేలస్‌లో ఫోటోలు అవీ


దిగి... తర్వాత మా అమ్మనాన్నల షష్టిపూర్తికి కావాల్సిన బట్టల షాపింగ్ కూడా చేయాలను కున్నాం. కనుక మాకూ మీలాగే ఇక్కడ ఇంత సేపు ఈ లైన్ ఉండటం ఇబ్బందే..." అన్నాడు అల్లుడు పళ్ళికిలిస్తూ.

"అబ్బా! అల్లుడూ... దయచేసి నీ ఊహలకి రెక్కలు కత్తిరించి ఊరుకుంటావా?" అంటూ దండం పెట్టాడు.

తర్వాత కూతురి వైపు చూస్తూ– "అమ్మా! మీరు దైవదర్శనం అంటే, మీతో పాటు అల సట లేకుండా... చక్కగా మెట్లన్నీ ఓపిగ్గా ఎక్కి దర్శనం చేసుకోవచ్చని సంబరపడి పోయాను. కానీ మీరిలా దేవుడి దర్శనానికి షార్ట్ కట్‌లో తీసుకువెళ్ళడం నాకు మింగుడు పడ్డంలేదు." అని ఓ నిట్టూర్పు విడిచాడు.

"కొంచెం మంచినీళ్ళు తాగండి మావయ్యా! మింగుడు పడుతుందేమో?" అన్నాడు మధు అమాయకంగా చూస్తూ.

"గొంతు మింగుడు పడ్డం కాదల్లుడూ... మనసుకి మింగుడు పడ్డంలేదు... అసలు దైవ దర్శనం అంటే, భక్తితో స్వామి ముందు ఓ సాధారణ భక్తుడిలా నిలబడి... నేను అల్పుడిని, నువ్వే దిక్కు, నాకు రక్షగా నిలబడు అని... శ్రీనివాసుని వేడుకోవడం!... అంతే కానీ మన అంతస్తు, డాబు,దర్పం, దర్జా, హెూదా, డబ్బు, రికమండేషన్‌తో వెళ్ళి, అదో తూతూ మంత్రం కార్యక్రమంలా చేయడం నాకు ఇబ్బందిగా ఉంది... నేను ఎప్పటిలానే మెట్ల మార్గం గుండా నడిచి వెళ్ళి దర్శనం చేసుకుంటాను... సారీ!..." అంటూ అతను వెనక్కి వెళ్ళి, లైన్‌లోంచి తప్పుకున్నాడు.




"ఏంటో ఇతని చాదస్తం!..." అన్నాడు మధు తల కొట్టుకుంటూ.

"నాకూ మా నాన్న చెప్పిందే నిజం అన్పి స్తోంది. వి.ఐ.పీ. దర్శనం గురించి, ముందు గానే ఆయన్ని కూడా ఓ మాట అడుగుదాం అంటే ఎవరూ నా మాట వినలేదు... నేను కూడా నడిచి సాధారణ క్యూలో దర్శనం చేసుకుంటాను!" చెప్పి ఆమె కూడా వెనక్కి నడిచింది.

మధు కూడా ఆమె వెనకే వెళ్తుండడంతో...

"నువ్వెక్కడికి రా?" అరిచాడు తండ్రి.

"ఇదిగో నాన్నా! మన ఫ్లైయిట్ టిక్కెట్లు... నేను కూడా సాధారణ క్యూలో వాళ్ళతో పాటే వస్తాను!" చెపుతూ వి.ఐ.పీ క్యూ నుండి బయటికి వెళ్ళిపోవడంతో...

మధు తల్లి, ఎర్రగా భర్త వైపు చూస్తూ...

"అఘోరించండి! మన వియ్యంకుడికి ఇలాంటివి నచ్చవూ వద్దూ అన్నా వినకుండా, కోడలి ముందూ, వియ్యంకుడి ముందూ డాబు చూపించడానికి, ఆ మినిస్టర్‌కి లక్ష తగలేసి, రికమండేషన్ లెటర్ తీసుకున్నారు...మీరే వెళ్ళండి!" అని ఆమే వెనుదిరిగింది.




## పాలపర్తి రాజగోపాల్, ఉమాదేవి స్మారక

# దసరా కార్టూన్ పోటీ

'జ్యోతిష విశారద' శ్రీ పాలపర్తి శ్రీకాంత్ శర్మ వారి తల్లిదండ్రుల స్మారకార్థం ఈ పోటీ నిర్వహిస్తున్నారు.



**సైలెంట్ స్మైల్**
కాప్షన్‌లెస్ కార్టూన్ పోటీ

**ఒక్కో కార్టూన్ కి 1000 రూపాయలు**
**చొప్పున10 బహుమతులు**

బహుమతి పొందిన కార్టూన్లతో పాటు బాగున్న కార్టూన్లు అక్టోబర్ సంచికలో ప్రచురిస్తాం!

ఈ **కాప్షన్‌లెస్** కార్టూన్ పోటీలో కార్టూన్లు సులభంగా అర్థమయి నవ్వొచ్చే వాటికే మొదటి ప్రాధాన్యత!

ఈ మెయిల్‌కి కార్టూన్లు పంపవలెను–
hasyanandampoteelu@gmail.com

కార్టూన్లు చేరవలసిన ఆఖరు తేదీ: **సెప్టెంబర్-05, 2025**




మన తెలుగు కార్టూనిస్టుల వైభవాన్ని పరిచయం చేస్తున్న శీర్షిక! 14

## చక్రవర్తి

**దేవగుప్తం శ్రీనివాసచక్రవర్తి** గుంటూరులో జూలై,07,1966 న పుట్టారు. బీయస్సీబీఈడీ చదివిన వీరు... ప్రస్తుతం యల్.ఐ.సీ సంస్థనందు దేవలప్ మెంట్ ఆఫీసర్గా ఉద్యోగం చేస్తున్నారు.

తల్లిదండ్రులు- కీ.శే. వెంకట శేషాచలపతిరావు, ఇందిరా కుమారి. సహధర్మచారిణీ శ్రీమతి కళ్యాణి, పిల్లలు దేదీప్య, దత్తవంశీలు.

కార్టూన్లు మొదలెట్టిన నాటి నుంచి 42ఏళ్లుగా అచ్చులో, అంతర్జాలమ్‌లో వరకు వివిధ పత్రికల్లో వివిధ భాషల్లో... వేలాదిగా కార్టూన్‌లు వేస్తూ... ఫేస్ బుక్ గ్రూప్ 'నవ్వుల సామ్రాజ్యం'తో హస్యాన్ని పంచుతున్నారు.


'నా మొదటి కార్టూన్ నుండి నాకు 'గీతోపదేశమ్' చేస్తున్న గురుదేవులు శ్రీజయదేవ్‌బాబు గారు నాకు ప్రాతఃస్మరణీయులు. శ్రీశంకుగారి హాస్యప్రియ పత్రిక నాకు మరువరానిది. శ్రీ బ్నింగారి ఆశీస్సులు... పుష్కర కాలంగా రాముగారి ప్రోత్సాహం... నా తోటి కార్టూనిస్ట్‌ల స్ఫూర్తి నన్ను కార్టూన్ల అభిమానిగా మార్చేసింది.' అంటారు చక్రవర్తిగారు.


2014 లో స్టార్ట్ చేసిన నవ్వుల సామ్రాజ్యమ్ ఫేస్ బుక్ గ్రూప్ కార్టూనిస్ట్‌లకి, పాఠకులకి ఒక వేదికగా నిరంతరాయం 25వేలమందితో నడుస్తోంది. ఉదయం 3.30కల్లా అన్ని దిన పత్రికల ఎడిటోరియల్ కార్టూన్‌లు ఒకే చోట 'వ్యంగ్య చిత్ర బ్రహ్మల నేటి గీతవిన్యాసాలు' శీర్షిక క్రింద 3,600 రోజులకు పైగా అప్ లోడ్ చేయడం అనేది చక్రవర్తిగారి కమిట్‌మెంట్‌కి నిదర్శనం.


వీరు విరివిగా కార్టూన్లు వేసే చక్రవర్తిగారు, అనేక హాస్యభరిత రీల్స్ ద్వారా కూడా అనేక మంది అభిమానులను సంపాదించుకున్నారు.


రెగ్యులర్‌గా కార్టూన్లు వేసే కొందమంది కార్టూనిస్టులలో చక్రవర్తిగారు ఒకరు.

ఈ నెలలో పుట్టిన చక్రవర్తిగారికి హాస్యానందం జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ... రాబోవు కాలంలో మరిన్ని మంచి కార్టూన్లతో పాఠకులను అలరించాలని కోరుకుంటోంది!


















ఛ్ఛీ ?? మీరు టార్న్ జీన్స్ అని .. చినిగి పోయిన ప్యాంట్స్ వేసుకోవట్లే ??
చక్రవర్తి



ఈతని ఆత్మ .. దీనిని వదిలి రాకపోవుటచే తప్పలేదు ప్రభూ ..!!
నరకం
చక్రవర్తి



మరేం భయంలేదమ్మా.. బేబీ లోపల మెసేజ్‌లు ఛాటింగ్ చేస్తోందంతే..!!
టిక్
టిక్..
టిక్...
చక్రవర్తి


క్విజ్ పోటీలకు జడ్జిగా .. సినిమా దర్శకుడిని .. పిలిచాం కదా అని ..
సెవెన్ టెన్త్ ఎన్ కార్పొరేట్ స్కూల్
బాలల దినోత్సవ వేడుకలు
RRR టీమ్
KGF టీమ్
పుష్ప టీమ్
చక్రవర్తి


ఇదే నా లవ్ లెటర్ .. స్కాన్ చేసి చూడు.. మీ నాన్నకు దొరక కూడదని.. ఇలా జాగ్రత్త పడ్డా ..
చక్రవర్తి


ఒరే బావా.. మనం సెట్టింగ్ వేసిన ప్లాబడ్జెట్ సినిమా.. కార్మికులే మారాజులు .. కి ఉత్తమ చిత్రం అవార్డొచ్చింది రోయ్ ..
చక్రవర్తి


స్టూడెంట్ వీసా ..లాలీ.. హెచ్ వన్ వీసాలాలీ .. గ్రీన్ కార్డూ లాలీ.. సిటిజన్‌షిప్ లాలీ
చక్రవర్తి


సనాతన ధర్మ పరిరక్షణా బోర్డ్ సభ్యులుగా.. జోసెఫ్ జాన్ .. అబ్దుల్ అలీ .. మేరీ నైటింగేల్ .. రహ్మతున్నీసా బేగం..లను ప్రభుత్వం నియమించింది.
TV 365
2044
చక్రవర్తి

# నవ్వులాట

గాంధీ మనోహర్, 98490 51846



## స్నేహం!

**సినీ హీరో నందమూరి తారకరామారావు అలియాస్ ఎన్టీవోడు తెలుగు దేశం అనే ఓ రాజకీయ పార్టీ పెట్టి పాలిటిక్స్‌లోకి వస్తున్నాడని తెల్సి దానిమీద రచ్చబండ మీద చర్చ నడుస్తోంది. పాలిటిక్స్ అంటే బాగా ఇష్టపడే దేవానంద్ అక్కడ మాట్లాడాలని వున్నా తన మనసేమీ బాగాలేక పోవడంతో ఇంటికి వచ్చేసాడు.**

దేవానంద్ ఇంటికి వచ్చే సరికి రేడియోలో స్నేహం గొప్పదనం గురించి చెబుతున్నారు. అది వినడం ఇష్టం లేక రేడియోని కోపంగా కాలితో తన్నాడు.

ఆ తర్వాత ఆవేశంగా ఏదో ఓ నిర్ణయానికి వచ్చినట్టు ఓ ఇన్‌ల్యాండ్ లెటర్ తీసుకుని గబ గబా రాశాడు... అంతే కోపంగా దాన్ని తీసుకెళ్ళి పోస్ట్ డబ్బాలో పడేశాడు.

పై ఘటన జరిగిన రెండు రోజుల తర్వాత దేవానంద్ ఇంటికి పెరుమాళ్ అనే ఆయన వచ్చి–"అయ్యా! మీ ఫ్రెండ్ పట్టాభిగారు నెల క్రితం మీకు ఇవ్వమని పదివేలు ఇచ్చాడు. కానీ ఆ డబ్బు నా బామ్మర్ది దొంగతనంగా తీసుకుని పారిపోయినాడు... ఈ విషయం పట్టాభి గారికి చెప్తే కోప్పడతారని చెప్పలేదు. ఇప్పుడు ఆ డబ్బులు అడ్జెస్ట్ అయ్యాయి... మీకు ఇద్దామని తీసుకుని వచ్చాను." అని పెరుమాళ్ తనని క్షమించమని కోరుతూ దేవానంద్‌కు వినయంగా ఇచ్చాడు.

దాంతో ఒక్కసారిగా దేవానంద్ తన మీద పిడుగు పడ్డట్టు తల్లడిల్లి పోయాడు.

పెరుమాళ్ దగ్గరి నుండి ఆ డబ్బు తీసుకుని దేవానంద్ తన భార్య కు ఇస్తూ–

"ఆ నాగరాజుగాడు వచ్చి అడిగితే... ఈ డబ్బు వాడి మొహాన కొట్టీ... ఇంకెప్పుడూ వాడి మొహాన్ని నాకు చూపించద్దని చెప్పు! " అని అక్కడి నుండి పరుగు పరుగున పోస్ట్ మ్యాన్ ఇంటికి వెళ్ళాడు.

నిన్న తను పోస్ట్ చేసిన ఉత్తరం గురించి చెప్పి...

"అది దేవులపల్లికి ఎప్పుడు చేరచ్చు?" అని అడిగాడు .

"ఒక్కోసారి రెండు రోజులు లేదా మూడు నాలుగు రోజులు కూడా పడుతుంది." అని చెప్పాడు ఆ పోస్ట్ మ్యాన్.

దేవానంద్ ఆదరాబాదరాగా ఇంటికొచ్చి బ్యాగులో బట్టలు సర్దుకుని బయటికి వెళ్లబోతుంటే... "భార్య ఎక్కడికి వెళ్తున్నారు?" అని అడుగుతున్నా సమాధానం కూడా ఇవ్వకుండా హడావుడిగా సైకిల్ ఎక్కి... అక్కడి నుండి బయలుదేరి వెళ్ళిపోయాడు.

సైకిల్ మీద వెళ్తుండగా దేవానంద్ ఫ్లాష్ బ్యాక్ గుర్తుకు తెచ్చుకున్నాడు...

కొన్నాళ్ళ క్రితం దేవానంద్ ఇంటికి పట్టాభి వచ్చి తనకి పదివేలు అప్పుగా కావాలనీ మళ్ళీ మూడు రోజుల్లో తీసుకొచ్చి ఇస్తానని అన్నాడు. తామిద్దరిదీ యాభై ఏళ్ళ స్నేహం కాబట్టి తన దగ్గర లేకపోయినా ఏదో విధంగా ఇవ్వాలనుకున్నాడు... దేవానంద్ ఇవ్వగానే ఇవ్వచ్చన్న ఉద్దేశంతో తన ఊళ్ళో వున్న నాగరాజు అనే ఆయనకు అదే మాట చెప్పి ఆయన దగ్గర అప్పుగా తీసుకుని పట్టాభికి ఇచ్చాడు.

మూడు రోజులు కాదు గదా... ముప్పై రోజులైనా పట్టాభి అప్పుగా తీసుకున్న పదివేలు తీసుకొచ్చి ఇవ్వలేదు.

నాగరాజు రోజూ వచ్చి... అప్పు తీర్చమని గొడవ చేస్తున్నాడు.

ఇది నచ్చని దేవానంద్ భార్య... పట్టాభీని వాళ్ళ స్నేహాన్ని ఎద్దేవా చేస్తూ.. చిర్రుబుర్రులాడుతూ వుండేది.


ఈ చిరాకు పరాకుతో తన కోపాన్నంతా వెళ్లగక్కుతూ తమ యాభైఏళ్ళ స్నేహాన్ని కూడా మర్చిపోయి పట్టాభిని నమ్మకద్రోహిగా అభివర్ణిస్తూ, మాటమీద నిలబడలేని వ్యక్తిగా విమర్శిస్తూ ఉత్తరం రాసి పోస్ట్ చేశాడు.

కానీ ఈ రోజు ఆ పెరుమాళ్ అనే వాడు వచ్చి డబ్బు ఇచ్చాడు.

దేవానంద్ దేవులపల్లి చేరుకొని ముందుగా ఆ ఊరి పోస్ట్‌మేన్ ఇంటికి వెళ్ళి...

"పట్టాభికి ఈ రెండు మూడురోజుల్లో ఏమైనా ఉత్తరాలు వచ్చాయా? ముఖ్యంగా ఇన్‌ల్యాండ్ లెటర్స్..." అని అడిగాడు.

"నాకు గుర్తున్నంత వరకు... ఈ రెండు మూడు రోజుల్లో పట్టాభిగారికి ఇన్‌ల్యాండ్



లెటర్స్ అయితే లేదయ్యా!" అని ఆ పోస్ట్‌మేన్ కోర్ట్‌లో దొంగ సాక్ష్యం చెప్పే సాక్షిలా చెప్పాడు.

తర్వాత ఏదో కారణం చెప్పి–

"నేను ఈ ఊళ్ళో రెండు రోజుల వరకు వుంటాను. పట్టాభికి ఇన్‌ల్యాండ్ లెటర్స్ వస్తే మాత్రం ఆయనకు ఇవ్వకుండా నాకే ఇవ్వు!" అని పోస్ట్‌మ్యాన్‌కి పది రూపాయలు ఇస్తూ... రిక్వెస్ట్ చేసుకున్నాడు దేవానంద్.

దేవానంద్ అభ్యర్థనను మన్నించి... పోస్ట్ మ్యాన్–

"ఓకే.. డన్!" అన్నాడు.

తను రాసిన లెటర్ ఇంకా రాలేదన్న ఆశా భావంతో పట్టాభి ఇంటికి వెళ్ళాడు దేవానంద్.

తన ఫ్రెండ్ వచ్చినందుకు పట్టాభి ఎంతో సంతోషంగా ఆయనకు ఇష్టమైన వంటలు చేయమని తన భార్యతో చెప్పాడు.

పట్టాభి వాలకం చూస్తుంటే...

ఆ ఉత్తరం ఇంకా రానట్టు నిర్ధారించు కున్నాడు దేవానంద్.

ఒకటీ రెండూ రోజులు కాదు ఇదు రోజులు పట్టాభి ఇంట్లోనే వున్నాడు దేవానంద్.

కానీ తను రాసిన ఆ ఇన్‌ల్యాండ్ లెటర్ అయితే రాలేదు.

ఆ విషయం పక్కన పెడితే తనకి పట్టాభి ఇస్తున్న ఆతిధ్యానికి అపరాధ భావంతో కుమిలి పోతున్నాడు.

ఇలాంటి స్నేహితుడినా దుర్భాషలాడుతూ లెటర్ రాసింది... ఇలాంటి మిత్రుడినా నేను




అపార్థం చేసుకుంది? అని మదనపడుతూనే వున్నాడు.

ఐదు రోజుల తర్వాత కూడా ఆ ఉత్తరం రాకపోవడంతో... పోస్ట్‌మేన్ చెప్పినట్టు అది ఎక్కడో పోయినట్టు వుంది అన్నమాటనే నిర్ధారణ చేసుకుని...ఇక తన ఊరికి వెళ్ళాలనుకుని దేవానంద్ బయలుదేరుతుండగా...

"ఏరా!... నీకు చెప్పడం మర్చిపోయాను. నువ్వు నాకు రాసిన ఇన్‌ల్యాండ్ లెటర్ నాకు చేరింది... చదివాను కూడా!" పట్టాభి అనగానే కంగారు పడ్డాడు దేవానంద్.

ఏం చెప్పాలో... ఎలా చెప్పాలో... అర్థం కాక సిగ్గుతో తలదించుకున్నాడు.

"ఇదేనా రా నువ్వు నన్ను అర్థం చేసుకున్నది? మన యాభై ఏళ్ళ స్నేహంలో నేను ఎలాంటి వాడినో... తెల్సుకోలేక పోయావా? నేను చేసింది నమ్మకద్రోహమా? నేను మాట తప్పే మనిషినా?" అని పట్టాభి ఇలా నిష్టూరంగా మాట్లాడుతుంటే...


అతని మాటలకు... దేవానంద్ అడ్డు తగులుతూ...

"క్షమించు రా!... ఏదో ఆవేశంలో అలా రాశాను...' అని కన్నీళ్లు పెట్టుకున్నాడు.

దాంతో పట్టాభి మృదువుగా నవ్వుతూ–

"రేయ్ దేవా!... నువ్వు ఏదో చిరాకులో పరాకులో అలా రాసుంటావ్!... అది నేను ఊహించగలను. నా దేవానంద్ ఎలాంటివాడో నా ఇన్నేళ్ళ స్నేహంలో ఎన్నోసార్లు చూశాను! ఏదో ఆవేశంలో నువ్వు ఒక్కసారి ఇలా... అన్నంత మాత్రాన నీ స్నేహాన్ని అర్థం చేసుకోలేని అర్భకుడిని కాను!" అని దేవానంద్‌ని ఆలింగనం చేసుకున్నాడు పట్టాభి.

"థాంక్స్ రా!.. నాలా మూర్ఖంగా అపార్థం చేసుకోకుండా ఎంతో పెద్ద మనసుతో నన్ను అర్థం చేసుకుని... మన పాతికేళ్ళ స్నేహాన్ని కాపాడావు!" అని పట్టాభిని మరింత గట్టిగా ఆలింగనం చేసుకున్నాడు దేవానంద్.






# పదానందం-22



కూర్పు: పోపూరి విశ్వనాథ్, 9133197111

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | | ■ | ■ | 3 | |
| | ■ | | ■ | 4 | | | ■ |
| 5 | | | ■ | | ■ | | ■ |
| ■ | ■ | 6 | 7 | | ■ | 8 | 9 |
| 10 | 11 | ■ | | ■ | 12 | ■ | |
| ■ | | ■ | 13 | | | | ■ |
| 14 | | 15 | | ■ | | ■ | 16 |
| | ■ | | ■ | 17 | | | |

**ఆధారాలు:**

**అడ్డం:**

1. చాలా ఎక్కువ (4)
3. కోపంతోకూడిన కోరిక (2)
4. దీనిని ఇచ్చిపుచ్చుకోవాలంటారు (3)
5. విధానం సరిగాలేదు (3)
6. అటు నుంచి వచ్చిన ఆపద (3)
8. ఆడవారేకాదు, మగవారూ కనగలరు (2)
10. పనసపండులో ఉండేది (2)
13. పరాకు (4)
14. గజిబిజి, అర్థంకానిది (4)
17. ఖైదునుంచి బయటికి రావడం (4)

**నిలువు**

1. వికారం, ఒక సంవత్సరం (3)
2. ఉత్తరాభిమన్యుల కొడుకు... చెదరిపోయాడు (4)
3. మార్పు, చలనం (4)
4. విజ్ఞప్తి (3)
7. ఇలా నవ్వుతారట (4)
9. వాడుకభాషలో లకారం అంటే ? (2)
11. కంట్లోపడేది (3)
12. తలకాయలేని గురువు (4)
14. పిచ్చి, వెర్రిలాంటిది (2)
15. రెండవ, తరువాత (2)
16. ధర (2)

**సమాధానం వచ్చే సంచికలో**

## పదానందం-21 సమాధానం

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 పొ | మ్మ | 2 న | లే | 3 క | ■ | 4 వీ | 5 సం |
| ర | ■ | ల | ■ | 6 మూ | 7 ర | ■ | క |
| 8 పొ | ర | పొ | టు | ■ | 9 చీ | 10 క | టి |
| చ్చా | ■ | రి | ■ | 11 స | ■ | ల్ప | ■ |
| లు | ■ | 12 ప | 13 రి | గ | 14 ణ | న | ■ |
| ■ | 15 వ | ■ | స | ■ | ర | ■ | 16 ప |
| 17 న | యా | గ | రా | ■ | 18 ప్రే | య | సి |
| క్క | ■ | ■ | 19 స | త్తు | ■ | ■ | డి |

తెలుగులో వెలువడుతున్న
ఏకైక హాస్య మాస పత్రిక
హాస్యానందం
చందాదారులుగా చేరండి!
నవ్వే లక్షణం మీ సొంతం చేసుకోండి!!

Owned & Published by : Ramu Panda from D.No.8-215/4, Yerrabalem, Guntur Dist.
Printed at: Rainbow Print Pack, Hyderabad. Edited by.Ramu.P





**Sambamurty Enterprises**

12-10-04, Convent Street, Vijayawada-520 001. fone: 9676444548

Hasyanandam July-2025 RNI No. APTEL 08387/01/1/2003-TC

